
ప్రజాశక్తి

ఆదివారం 14 ఏప్రిల్ 2024 | 8 పేజీలు



తిరుపతి



చిత్తూరు



శెనక్కాయలు కొనేవారేరి..?

అమ్మబోతే అడవి.. కొనబోతే కొరివి
ధర లేక కల్లాల్లో రాసులు వెలవెల
మద్దతు ధర ప్రకటించని ప్రభుత్వం
దళారులు నిర్ణయించిందే ధర

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

సాంప్రదాయ వాణిజ్య పంటల్లో వేరుశెనగ ఒకటి. పంటల సాగులో ఆధునిక, యాంత్రీకరణ పద్ధతులు కొత్త పుంతలు తొక్కుతున్నా శెనగ సాగు కత్తిమీద సాము లాంటిదే. విత్తు విత్తిన మొదలు కాయలు చేతికొచ్చి విక్రయించే వరకూ రైతు ఎంతో వ్యయ ప్రయాసలు పడాల్సిందే. తీరా కాయలకు మద్దతు ధర లభించని పరిస్థితుల్లో రైతు దిగాలు పడే పరిస్థితి ఏటా ఏర్పడుతోంది. ఈ నేపథ్యంలో శెనగ సాగుపై రైతులు క్రమేణా మక్కువ చూపడం మానేశారు. అయితే వ్యవ'సాయాన్ని' వత్తిగా మార్చుకున్న కొందరు రైతులు శ్రమ అయినా శెనగ సాగుకు దిగుతున్నారు. ఈ ఏడు కూడా కొద్దో గొప్పో రైతులు వేరుశెనగ పంటలు సాగు చేశారు. అయితే కొనే నాధుడు లేకపోవడంతో ప్రభుత్వం వంక దిగాలుగా చూస్తున్నాడు. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు శెనగ పంటకు(ఎంఎస్పీ) మద్దతు ధర ప్రకటించకపోవడంతో దళారులు రైతులను దగా చేసి అత్తెసర ధరకు కాయలను కొంటుండటం విచారకరం.

ధర లేక కల్లాల్లో రాసులు వెలవెల

జిల్లాకు ధాన్యాగారాలుగా పిలుచుకునే తూర్పు మండలాల్లో ఒకప్పుడు వరికి సమానంగా వేరుశెనగ పంట సాగయ్యేది. అయితే పెట్టుబడి ఖర్చులు పెరిగిపోవడం, గిట్టుబాటు ధర లేకపోవడంతో శెనగ సాగు కష్టతరమైన నేపథ్యంలో కాలక్రమేనా రైతులు శెనగ సాగును వీడి ప్రత్యామ్నాయ పంటలపై మొగ్గుచూపారు. ఫలితంగా వేరుశెనగ సాగు తూర్పు మండలాల్లో గణనీయంగా తగ్గిపోయింది. ఈ ఏడాది రబీలో శ్రీకాళహస్తి వ్యవసాయ శాఖ డివిజన్ పరిధిలో సుమారు 2 వేల ఎకరాల్లో వేరుశెనగ పంటను రైతులు సాగు చేశారు. డివిజన్ వ్యాప్తంగా దాదాపు శెనగ ఒబ్బిళ్లు పూర్తి అయ్యాయి. అయితే మద్దతు ధర లేకపోవడంతో అమ్ముకునే దారి లేక కాయలు కల్లాల్లోనే మగ్గుతున్న పరిస్థితి కనబడుతోంది.

దళారులు నిర్ణయించిందే ధర!

గతేడాది 40 కిలోల వేరుశెనక్కాయల బస్తా(నాణ్యతను బట్టి) రూ.3000 నుంచి రూ.3200 ధర పలికింది. మూడో గ్రేడ్ కాయలు కూడా కనీసం రూ.2900 వరకు ధర పలికాయి. అయితే ఈ ఏడాది గ్రేడ్-1 కాయలను రూ.3 వేలకు కూడా కొనని పరిస్థితి కనబడుతోంది. ప్రస్తుతం 40కిలోల బస్తాకు దళారులు సిండికేట్ ఏర్పడి కేవలం రూ.2400 ధర నిర్ణయించినట్లు రైతులు వాపోతున్నారు. ఎకరా పొలంలో శెనగ పంట సాగు చెయ్యాలంటే సుమారు రూ.50 వేలకు పై మాటే పెట్టుబడి ఖర్చు అవుతోంది. దిగుబడి 30 బస్తాలు వేసుకున్నా ప్రస్తుత మద్దతు ధరతో పెట్టుబడి డబ్బు కూడా రాని పరిస్థితి నెలకొంటుందని రైతులు వాపోతున్నారు. ఒక పక్క అప్పులు.. మరో పక్క కల్లాల్లో కొనుగోలు కాని కాయలు..వెరసి రైతులు అరకొర ధరకే కాయలను తెగనమ్ముకోవాల్సి వస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వేరుశెనగ పంటకు మద్దతు ధర ప్రకటించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రభుత్వం ఆదుకోవాలి: మనోహర్, రైతు

ఎకరా పొలంలో వేరుశెనగ పంట వేశా. రూ.50 వేలు పెట్టుబడి అయ్యింది. వానలు లేకపోవడంతో నీటి ఎద్దడి కారణంగా దిగుబడి కూడా తగ్గింది. తీరా ఫలితం వచ్చాక అమ్మబోతే అడవి..కొనబోతే కొరివి అన్న తీరుగా దళారులు వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించి ఆదుకోవాలి.

'పవన్' మద్దిస్తం... హిట్టా, ఫట్టా..!

తిరుపతి అభ్యర్థి 'చిచ్చు' ఆరినట్లేనా..!
అధినేతలు బుజ్జగించినా 'పట్టు'గానే నేతలు
ప్రచారానికి దూరంగానే అసమ్మతి




సోమవారం ప్రచారానికీ కలిసిరాని అసమ్మతి నేతలు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

'వైసిపిలో సీటు లేదు పొమ్మంటే, వెంటనే జనసేన కండువా కప్పకున్న వ్యక్తికి ఉన్నఫళంగా సీటివ్వాల్సినంత అవసరం ఏమొచ్చింది.. ఇన్నాళ్లూ పార్టీ కోసం కష్టపడి పనిచేసిన తిరుపతి నాయకత్వం అభ్యర్థిత్వానికి పనికిరాలేదా..? పార్టీ కష్టాల్లో ఉన్నపుడు కాపాడింది మేం కాదా..? వైసిపి నిర్బంధాలను ఎన్నిసార్లు ఎదుర్కొన్నాం.. పొత్తులో భాగంగా జనసేనకు తిరుపతి ఇచ్చారు.. సరే.. చిత్తూరు నుంచి ఆరణి శ్రీనివాసులును తీసుకొచ్చి అభ్యర్థిత్వం ఇవ్వాల్సిన అత్యవసరం ఏమొచ్చింది.. తిరుపతి నాయకత్వం అంత పనికిరాకుండా

2లో





నేడు, రేపు షర్మిల పర్యటన

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో



ఎపిపిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల ఎన్నికల ప్రచార నేపథ్యంలో బస్సు యాత్ర ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పర్యటించనుంది. ఆదివారం ఉదయం 9 గంటలకు శ్రీకాళహస్తిలో ర్యాలీ నిర్వహించనున్నారు. బేరివారి మండపం వద్ద ఉదయం 10 గంటలకు ఎన్నికల సభలో మాట్లాడతారు. శ్రీకాళహస్తిలో పర్యటన ముగించుకుని సత్యవేడు నియోజకవర్గంలో రోడ్డుషో నిర్వహిస్తారు. అక్కడనుంచి నగిరికి చేరుకుని సాయంత్రం సభలో పాల్గొంటారు. అదేరోజు రాత్రి తిరుపతిలో బస చేస్తారు. సోమవారం ఉదయం జీడీనెల్లూరు, మధ్యాహ్నం చిత్తూరు, సాయంత్రం పలమనేరుల్లో సభల్లో పాల్గొంటారు.



(మొదటి పేజీ తరువాయి)

'పవన్' మద్దిస్తం... హిట్టా, ఫట్టా..!


పోయిందా' అన్నదే అసమ్మతి నేతల ఆవేదన.

తిరుపతి మాజీ ఎంఎల్ఎ సుగుణమ్మది, జనసేన తిరుపతి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కిరణ్‌రాయల్‌ది ఒకటే ఆవేదన. అందుకే అభ్యర్థిగా ఆరణి శ్రీనివాసులును ప్రకటించి రెండు వారాలు దాటినా వీరి పట్టు వీడలేదు. కిరణ్‌రాయల్ 'పట్టు'గానే తొలినుంచి దూరంగానే ఉండి విముఖత చూపుతూ వచ్చారు. సుగుణమ్మ మాత్రం నారా లోకేష్‌ను, నారా చంద్రబాబును, పవన్‌కల్యాణ్‌ను వీలైనన్నిసార్లు కలిసి వేడుకుంటూనే ఉన్నారు. పొత్తులో భాగంగా టిడిపికి ఇవ్వలేకపోతే, జనసేనలో అయినా ఇప్పించాలని మొరపెట్టుకుంటూనే ఉన్నారు. తిరుపతి కోటలో టిడిపికి టిక్కెట్ లేకుండా పోటీ చేయడం తొలిసారైతే, తిరుపతి నాయకత్వాన్ని కాదనడాన్ని వారు జీర్ణించుకోలేకపోతున్నారు. అందుకే కిరణ్‌రాయల్, సుగుణమ్మలు అధినేతల ముందు సర్దుకుపోతామని చెప్పినా, వాళ్లు వెళ్లిన మరుక్షణం నుంచి మొహం చాటేస్తూనే ఉన్నారు.

తిరుపతి అసమ్మతిని చక్కదిద్దేందుకు ఆకస్మికంగా జనసేన అధినేత పవన్‌కల్యాణ్ శుక్రవారం సాయంత్రం అన్న నాగబాబుతో కలిసి విచ్చేశారు. అర్ధరాత్రి వరకూ ఓ ప్రైవేట్ హోటల్లో టిడిపి, జనసేన, బిజెపి నేతలతో వేర్వేరుగా చర్చలు జరిపారు. మాజీ ఎంఎల్ఎ సుగుణమ్మతో అయితే గంటపాటు రహస్య మంతనాలు నిర్వహించారు. 'మీడియా'తో మూడు జెండాల అజెండా ఒక్కటేనని, తిరుపతిలో వైసిపి జెండా లేకుండా చేస్తామని, జనసేన జెండా ఎగురవేస్తామని టిడిపి తిరుపతి జిల్లా అధ్యక్షులు నరసింహయాదవ్, బిజెపి రాష్ట్ర నాయకులు భానుప్రకాష్‌రెడ్డి, జనసేనలో అలిగిన తిరుపతి ఇన్‌ఛార్జి కిరణ్‌రాయల్ మూకుమ్మడిగా ప్రకటించారు. అయితే శనివారం సిఎస్ థియేటర్ నుంచి లీలామహల్ వరకూ జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాస్ ప్రచారం నిర్వహించారు. బిజెపి – టిడిపి – జనసేన నుంచి చోటామోటా నాయకులు తప్ప పవన్‌కల్యాణ్ ముందు హామీ ఇచ్చిన ఒక్కరు కూడా ప్రచారంలో కనిపించకపోవడం గమనార్హం. అధినేతలు పవన్‌కల్యాణ్, చంద్రబాబు ముందు తల ఊపడమే తప్ప, వాస్తవానికి ఆరణి అభ్యర్థిత్వాన్ని వారు అంగీకరించే పరిస్థితుల్లో లేరని ప్రస్ఫుటమవుతోంది. అయితే పవన్‌కల్యాణ్‌తో ఫొటో దిగిన నేతలు అందరూ వాట్సాప్‌ల్లో, ఫేస్‌బుక్‌ల్లో 'సయోధ్య కుదిరింది' అన్నట్లుగా బిల్డప్‌లు ఇవ్వడం శోచనీయం. ఏదిఏమైనా ఆరణి అభ్యర్థిత్వం, తిరుపతి నేతల అసమ్మతి నేపథ్యంలో ఎక్కడ సీటు కోల్పోతామోననే భయం అధినేతల్లో లేకపోలేదు. వైసిపి అభ్యర్థి భూమన్ అభినయ్‌రెడ్డి గెలవకుండా చూడాలని, కూటమి ఓట్లు చీలకుండా చూడాల్సిన బాధ్యత మూడు పార్టీలపై ఉందని హితబోధ చేసి వెళ్లారు. ఆరణి శ్రీనివాసులును అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని ఆదేశించారు. శుక్రవారం నాటి పవన్ మద్దిస్తం హిట్టా, ఫట్టా వేచి చూడాల్సిందే మరి.

'పక్షులు మానవ మనుగడకు అవసరం'

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:
అపోలో యూనివర్సిటీ చిత్తూరులో బర్డ్ మాన్ కార్తీక్, ప్రముఖ అంతర్జాతీయ ఫోటోగ్రాఫర్, వైడ్‌లైఫ్ పరిశోధకులుచే ప్రత్యేక తరగతులను నిర్వహించారు. కార్తీక్ మాట్లాడుతూ శేషాచలం అడవులు చాలా అరుదైనటువంటి వన్యప్రాణులకు నివాసమని, అందులో 215 వివిధ రకాల పక్షులు ఉన్నాయని అందులో ఇప్పటివరకు 190 పక్షులను గుర్తించి వాటి ఫోటోలు సేకరించాలని పేర్కొన్నారు. పక్షుల ద్వారా మానవ మనుగడకు కాలుష్య నివారణకు అరుదైన మొక్కలకు సహకరిస్తుందని వారి ప్రసంగంలో పేర్కొనడం జరిగింది. పక్షులను ఎలా కాపాడుకోవాలి అలాగే వాటి సంరక్షణ గురించి విద్యార్థులకు కార్తీక్ వివరించారు. ఈకార్యక్రమంలో 200కుపైన విద్యార్థులు పాల్గొన్నారు. నరేష్ రెడ్డి, ప్రొఫెసర్ సేతు, డాక్టర్ కైలాష్ నాథ్‌రెడ్డి, డాక్టర్ మహేంద్ర నాథ్, డాక్టర్ షానీ, డాక్టర్ నవీన్, డాక్టర్ పురుషోత్తం, డాక్టర్ ఫిరోజ్ బేగం పాల్గొన్నారు.



మానవ మనుగడకు పక్షుల ఆవశ్యకత వివరిస్తున్న నరేష్

సర్వదర్శనం భక్తులకా...దళారులకా..!

శ్రీవారిమెట్టు మార్గంలో పోటెత్తిన భక్తులు / టాక్సీడ్రైవర్లకు వరంగా మారిన టైంస్లాట్

ప్రజాశక్తి -రామచంద్రపురం (చంద్రగిరి)

శ్రీవారి దర్శనం కోసం శ్రీవారి మెట్టు వద్దకు భక్తులు పోటెత్తారు.. శనివారం శ్రీవారి మెట్ల వద్ద సర్వదర్శనం టోకెన్లు పొందేందుకు రికార్డు స్థాయిలో చేరుకున్నారు.. కరోనా సమయంలో టిటిడి రోజుకు 6వేల టైం స్లాట్ టోకన్లను పంపిణీ చేస్తూ శ్రీవారి మెట్టు నడక మార్గంలోని 1200 మెట్టు వద్ద టిటిడి విజిలెన్స్ అధికారులు టిటిడి కి సంబంధించిన స్టాంపు వేసేవారు. ఇప్పుడు టిటిడి శ్రీవారి మెట్టు ద్వారా నడక మార్గంలో వెళ్లే భక్తులకు రోజుకు 3వేల టైం స్లాట్ టోకన్లు పంపిణీ చేస్తోంది. కానీ టైం స్లాట్ టోకన్లపై మార్గమధ్యంలో టిటిడి విజిలెన్స్ అధికారులు స్టాంపు వేయడం ఆపివేశారు. ఇదే అదునుగా టాక్సీ డ్రైవర్లు.... టోకన్లు పంపిణీ చేసే సిబ్బంది, టిటిడి విజిలెన్స్ అధికారులతో కుమ్మక్కై భక్తులను నిలువు దోపిడీ చేస్తున్నారు. శ్రీవారి దర్శనం కల్పిస్తామంటూ ఒక్కొక్కరి దగ్గర వెయ్యి రూపాయలు వసూలు చేసుకుని, శ్రీవారి మెట్టు వద్ద భక్తులకు టోకెన్లు కట్టించి.... తిరిగి టాక్సీ వాహనంలో


శ్రీవారి మెట్టు వద్ద పోటెత్తిన భక్తులు

అలిపిరి ద్వారా తిరుమలకు తీసుకొని వెళ్లి దర్శనం చేస్తున్నారు. టిటిడి విజిలెన్స్ అధికారుల సాక్షిగా ఇంత అక్రమాలు జరుగుతున్నా పట్టించుకోవడంలేదని భక్తులు అంటున్నారు. టాక్సీ డ్రైవర్లు భక్తుల నుండి శ్రీవారిదర్శనం పేరుతో వసూలు చేసిన నగదును టోకన్లు పంపిణీ చేసే సిబ్బంది, అక్కడ పనిచేసే విజిలెన్స్ అధికారులకు చేతులు మారుతున్నాయని స్థానికులు బహిరంగ విమర్శలు చేస్తున్నారు. టోకెన్లపై టిటిడి సిబ్బంది స్టాంపింగ్ ఆపివేయడం వల్ల టాక్సీ డ్రైవర్లకు వరంగా మారింది. దీనివల్ల స్వామి వారిపై భక్తితో నడిచి వెళ్లే నిజమైన భక్తులకు అన్యాయం జరుగుతోంది. సులభమైన మార్గంలో త్వరగా శ్రీవారి దర్శనం పేరుతో తిరుపతి, రేణిగుంట, శ్రీకాళహస్తి, చంద్రగిరి ప్రాంతాల నుంచి వాహనాలలో భక్తులు శ్రీవారి మెట్ల వద్దకు వచ్చి టైం స్లాట్ టోకెన్లు తీసుకుంటున్నారు. ఈ తంతు వల్ల శ్రీవారి మెట్టు వద్ద భక్తుల రద్దీ ఎక్కువైపోతున్నది. దూర ప్రాంతాల నుండి తిరుమలకు వెళ్లే భక్తులకు టోకెన్లు అందడం లేదు. దీనివల్ల భక్తులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. టైం స్లాట్ టోకన్లపై మార్గమధ్యంలో స్టాంపింగ్ విధానాన్ని పునరుద్ధరించకపోతే స్వామి వారి భక్తులను టాక్సీ డ్రైవర్లు, దళారులు దోచుకోవడం ఎక్కువైపోతుంది. దీనిపై టిటిడి పాలక మండలి, టిటిడి పరిపాలన అధికారి ఏవి ధర్మారెడ్డి స్పందించి చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

అభివృద్ధి చూసి ఓటేయండి : భూమన అభినయ్ రెడ్డి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ

వారసత్వంగా తనకు ఓటేయమని అడగటం లేదని, తిరుపతిలో తాను చేసిన అభివద్ధిని చూసి ఓటు వేయాలని అడుగుతున్నానని వైసిపి తిరుపతి ఎమ్మెల్యే అభ్యర్థి భూమన అభినయ్ రెడ్డి కోరారు. జీవకోన 48వ వార్డులో శనివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైయస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం మహిళల పక్షపాతి అని, లంచాలు లేకుండా వాలంటీర్లు, సచివాలయల వ్యవస్థ ఏర్పాటుచేసి, ఇంటి ముందుకే పథకాలను జగనన్న చేరవేస్తున్నారన్నారు. గతంలో ఏ నాయకుడు ఇలాంటి మంచి పనులు చేయలేదన్నారు. అధికారంలోకి వచ్చిన ఈ ఐదేళ్లలో దాదాపు రూ.35వేల కోట్లు డ్వాక్రా రుణాలను మాఫీ చేశామన్నారు. ఇక వైఎస్సార్ చేయూత పథకం ద్వారా



ప్రతి ఏడాదీ రూ.18,750 ఇస్తున్నారని, మహిళలు ఆర్థికంగా ఎదిగేలా జగనన్న మహిళా మార్ట్‌లు స్థాపించి లాభాల బాట పట్టించామన్నారు. మంచి పనులు చేస్తున్న జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్క మహిళపై ఉందన్నారు. అందుకే రాబోయే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

దర్జీల అభ్యున్నతికి కృషి చేస్తా : బొజ్జల సుధీర్‌రెడ్డి

ప్రజాశక్తి–శ్రీకాళహస్తి

దర్జీల అభ్యున్నతికి కషి చేస్తామని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి హామీ ఇచ్చారు. శ్రీకాళహస్తి మండలం ఊరందూరులో శనివారం దర్జీలతో ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. బొజ్జల వెంకటసుధీర్ రెడ్డిని దర్జీల సంఘం నేతలు గజమాలతో సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దర్జీల సమస్యలు తనకు బాగా తెలుసన్నారు. ఈ కార్యక్రమంలో పోలూరు శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

అనంతరం శ్రీకాళహస్తి పురపాలక సంఘం పరిధిలోని 29,



30వ వార్డుల్లో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బొజ్జల వెంకటసుధీర్ రెడ్డికి స్థానికులు ఘనంగా స్వాగతం పలికారు. ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సమస్యలు పోవాలంటే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిని గెలిపించాలని కోరారు. టీడీపీ సూపర్ సిక్స్ పథకాలు గురించి ప్రజలకు వివరించారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీని ఓటు ద్వారా ఇంటికి పంపాలన్నారు. టీడీపీ పట్టణ అధ్యక్షులు విజయ్ కుమార్, క్లస్టర్ ఇంఛార్జి కంఠా రమేష్, కాసరం రమేష్, గోపి, మణికంఠ పాల్గొన్నారు.

జనసేనానిని కలసిన బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి

తిరుపతి పర్యటనకు విచ్చేసిన జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ను శనివారం శ్రీకాళహస్తి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన శ్రీకాళహస్తి నియోజకవర్గ ఎన్డీఎ కూటమి పనితీరు గురించి వివరించారు. కూటమి విజయానికి ఐకమత్యంతో పని చేస్తున్నట్లు చెప్పారు.

చిత్తూరును అభివృద్ధి చేయాలి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:
స్థానిక పెన్షనర్ భవన్‌లో శనివారం న్యాయవాదుల మండలి చైర్మన్‌గా ఎన్నికైన నల్లారి ద్వారకనాథ రెడ్డిని చిత్తూరు స్మార్ట్ సిటీ డెవలప్మెంట్ సొసైటీ ప్రతినిధులు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహానగరాలైన బెంగళూరు, చెన్నైకి సమీపంలో ఉన్న చిత్తూరుని అభివద్ధి చేయాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. దీనికి పోరాటం చేస్తున్న సొసైటీని అభినందించారు. అనంతరం నగరం ఎదుర్కొంటున్న సమస్యలను గోపి నాయక్, అశోక్ కుమార్, రిటైర్డ్ ఎస్ఐ మురళి, సత్య వివరించారు. అనంతరం ప్రెసిడెంట్ తాండవ మూర్తి 25 మందితో కూడిన ఎగ్జిక్యూటివ్ మెంబర్లను చదివి వారితో ప్రమాణం చేయించారు. శోభారాణి, శ్రీదేవి, గోపి నాయక్,



మురళి, శ్రీనివాస్ బాబు, కిషోర్, సాదిక్, రాజేంద్ర, మల్లికార్జునరావు, గణేష్, శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.

17న సీతారాముల కల్యాణం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి శ్రీకాళహస్తీశ్వర ఆలయానికి అనుబంధంగా శ్రీకాళహస్తి పట్టణం నెహ్రూవీధిలో వెలసిన శ్రీ పట్టాభిరాముల ఆలయంలో ఈ నెల 17వ తేదీ బుధవారం శ్రీరామనవమిని పురస్కరించుకుని సీతారాములు కల్యాణం నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా జరుగుతున్న ఏర్పాట్లను శనివారం ముక్కంటి ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్వీ నాగేశ్వరరావు పరిశీలించారు. సీతారాముల కల్యాణం సందర్భంగా ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆలయ అధికారులను ఆదేశించారు. డిప్యూటీ ఈవో ఏకాంబరం, ఈఈ నూకరత్నం, ఏఈవో సతీష్ మల్లిక్ పాల్గొన్నారు.

సమస్యాత్మక గ్రామాల్లో పోలీస్ కవాతు

ప్రజాశక్తి రామచంద్రపురం(చంద్రగిరి)

తిరుపతి జిల్లా, చంద్రగిరి నియోజకవర్గంలో చంద్రగిరి మండలంలోని సమస్యాత్మక గ్రామాలలో స్థానిక సీఐ రామయ్య ఆధ్వర్యంలో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. శనివారం ఎన్నికల అధికారి గుర్తించిన సమస్యాత్మక గ్రామాలు ఐతేపల్లి, అగరాల,కొట్టాల, రామిరెడ్డిపల్లి, పుల్లయ్య గారి పల్లి గ్రామాలలో జరగబోవు సార్వత్రిక ఎన్నికలు ఓటర్లు తమ ఓటుహక్కును నిర్భయంగా వినియోగించుకోవచ్చునని ఆయన ప్రజలకు భరోసా ఇచ్చారు. మండలంలో సార్వత్రిక ఎన్నికలు శాంతియుతంగా జరిగేందుకు ప్రజలు సహకరించాలన్నారు. ఓటర్లు ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై అనిత పాల్గొన్నారు.

వేడుకగా శ్రీ కోదండరాముడి చక్రస్నానం

తిరుపతి సిటీ : శ్రీ కోదండరామస్వామి బ్రహ్మోత్సవాల్లో చివరిరోజైన శనివారం ఉదయం కపిలతీర్థంలోని పుష్కరిణిలో చక్రస్నానం నేత్రపర్వంగా జరిగింది. విశేష సంఖ్యలో భక్తులు పాల్గొని పుణ్యస్నానాలు ఆచరించారు. రాత్రి ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగిసాయి. తిరుమల పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, ఆలయ డెప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో పార్థసారథి, కంకణభట్టర్ సీతారామాచార్యులు, సూపరింటెండెంట్ సోమశేఖర్ పాల్గొన్నారు.

నేడు మహతిలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి

తిరుపతి సిటీ : టీటీడీ ఆధ్వర్యంలో బాబా సాహెబ్ డాక్టర్
బిఆర్ అంబేద్కర్ 133వ జయంతి ఉత్సవం ఆదివారం తిరుపతి మహతి ఆడిటోరియంలో జరగనుంది. ఉదయం 10.30 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుంది. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని ఓంశ్రీ సాయిరాం వృద్ధాశ్రమంలో ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దాతలుగా మెడనూరు సురేష్ రెడ్డి , శాంతి దంపతులు వ్యవహరిం చారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు కడివేటి చంద్ర శేఖర్ మాట్లాడుతూ ప్రతి నెల రెండవ శనివారం క్రమం తప్పకుండా ఇస్తున్న విధంగా వృద్ధాశ్రమంలో తమ సంస్థ ద్వారా అన్నదానం నిర్వహించారు. దాతల సహకారం మరువ లేని వన్నారు. ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవరచు కోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు శ్రీనివాసులు, ఐటిఐ ప్రభాకర్, రాము, కళ్యాణి, పాల్గొన్నారు.

గూడూరు టౌన్ : అన్ని దానాలలో కెల్లా అన్నదానం మిన్న అని శ్రీ కృష్ణా సేవా సమితి అధ్యక్షుడు మయూరి శ్యామ్ యాదవ్ పేర్కొన్నారు. శనివారం గుడూరు పట్టణంలోని గమళ్లపాలెంలోని మెప్మా సౌజన్యంతో మై ఫ్రెండ్స్ అసోసియేషన్‌లో రైల్వే అధికారి అరేటి వెంకటేశ్వర్లు సతీమణి సునీత జన్మదినం సందర్భంగా అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా మయూరి శ్యామ్ యాదవ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవా దృక్పథం అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రమేష్ పాల్గొన్నారు.

వైసిపి కార్యకర్త సతీమణి మృతికి నివాళి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రూరల్ మండలం పరమేశ్వర మంగళం ఎన్‌టిఆర్ కాలనీకి చెందిన వైసిపి కార్యకర్త రమేష్ భార్య అమ్ములు శనివారం ఆకస్మికంగా మృతి చెందింది. విషయం తెలుసుకున్న మంత్రి రోజా సోదరులు రాంప్రసాద్ రెడ్డి ఎన్‌టిఆర్ కాలనీకి వెళ్లి ఆమె భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మున్సిపాల్టీ పరిధిలోని చిన్నరాజుకుప్పంకు చెందిన సరోజమ్మ భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అంత్యక్రియలకు రోజా ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా 10 వేల రూపాయలు, మరొకరికి పదివేల రూపాయలు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ భాస్కర్ యాదవ్, మున్సిపల్ ఛైర్మన్ ఏ హరి, వైసిపి కుటుంబ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇరు గ్రూపుల ఘర్షణ

- పరిస్థితులపై నగిరి డిఎస్పి పర్యవేక్షణ
- కేసు నమోదు

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం: మండలంలోని కొత్తపల్లి గ్రామపంచాయతీ కొత్తపల్లిమిట్టలో టిడిపి, వైసిపి ఇరు గ్రూపుల మధ్య శనివారం ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో కొత్తపల్లి మిట్ల జరిగిన గొడవల కారణంగా వైసిపి, టిడిపి నాయకులు ఇచ్చిన ఫిర్యాదుపై విచారణకు నగిరి డిఎస్పి కెఎస్.మూర్తి, కార్వేటినగరం సిఐ సత్తిబాబు స్థానిక ఎస్సై రాజకుల్లాయప్ప కొత్తపల్లిమిట్టకు చేరుకొని ఇరువర్గాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టారు. గ్రామంలో ఇరు వర్గాల గొడవలు లేకుండా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడకుండా శాంతియుతంగా ఉండాలని తెలిపారు. గ్రామాలలో పోలీసు గస్తీ ఏర్పాటు చేశారు.



పరిస్థితిని పర్యవేక్షిస్తున్న పోలీసులు

'వేధింపులు ప్రశ్నిస్తే దాడి చేశారు'

- న్యాయం చేయండి
- బాధితురాలి అభ్యర్థన

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: దిశ చట్టం చేసిన ఏపీలో ఆడబిడ్డలపై దాడి చేస్తే చర్యలు చేపట్టాల్సిన పోలీసులు.. బాధితులని కించపరిచేలా, మనోభావాలు దెబ్బతినేలా మాట్లాడిన దురదష్టకర సంఘటన చిత్తూరు జిల్లాలో చోటుచేసుకుంది. సభ్య సమాజం తలదించుకునేలా యాదమరి మండలం వెంకటాపురం గ్రామంలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి చూసింది. తమ ఆడబిడ్డలను ఎందుకు వేధిస్తున్నావని ప్రశ్నించినందుకు తమ కుటుంబంపై గ్రామానికి చెందిన ఆకతాయిలు దాడి చేశారని, యాదమరి మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన బాధితులు కన్నీరు పర్యాంతమయ్యారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో బాధితులు మాట్లాడారు. తమ ఆడ బిడ్డలు చదువు, పనులు ముగించుకొని సాయంత్రం ఇంటికి వస్తుంటారని వారి రాకను గుర్తించిన ఆకతా యిలు గత కొంతకాలంగా వేధింపులకు పాల్పడు తున్నా రని తెలిపారు. ఈ విషయం తమకు తెలిసి ఆకతాయిని ప్రశ్నించడంతో మూకుమ్మడిగా తమపై దాడికి తెగబడ్డారని ఆవేదన చెందారు. తమ ఆడబిడ్డలపై వేధింపులు జరుగుతున్నాయని పోలీసులకు ఫిర్యాదు చేస్తే అవహేళనగా మాట్లాడుతున్నారని వాపోయారు. తాము ఎవరికీ చెప్పుకోవాలో తెలీక మీడియాను ఆశ్రయిస్తున్నామని, నిందితులను అరెస్టుచేసి తమకు న్యాయం జరిగేలా చూడాలని పోలీసు ఉన్నతాధికారులను బాధితులు అర్థించారు.



మాట్లాడుతున్న బాధిత మహిళ

పోలింగ్ కేంద్రాల తనిఖీ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రూరల్ ఏరియాలలో అన్నీ పోలింగ్ బూత్‌లలో ఏఎంఎఫ్ సదుపాయాలను నగరి ఎన్నికల అధికారి, ఆర్‌డివో కె వెంకటరెడ్డి శనివారం తనిఖీ చేశారు. 23 బూత్ లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు తహశీల్దారు కె శ్రీనివాస గౌడ్, ఎంపిడిఒ పి ప్రసాద్, పుత్తూరు, సెక్టోరల్ ఆఫీసర్‌లు, తనిఖీ చేశారు. ఈ తనిఖీలలో సూపర్ వైసర్‌లు, బి ఎల్‌వోలు హాజరయ్యారు.



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

క్రైం న్యూస్

దారి దోపిడీ, చోరీ కేసు నిందితుల అరెస్టు

రూ.1.25 లక్షల నగదు స్వాధీనం




పోలీసుల అదుపులో వున్న నిందితులు

ప్రజాశక్తి -సత్యవేడు: గతంలో దారి దోపిడీ, చోరీకి పాల్పడిన ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు సత్యవేడు సిఐ దివాకర్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తిరుపతి జిల్లా సత్యవేడు మండలం రంగనాథపురం తెలుగు గంగ బ్రిడ్జి వద్ద జరిగిన దారిదోపిడీ, మల్లవారి పాలెం టౌన్‌షిప్ కాలనీలో చోటు చేసుకున్న చోరీ కేసులో నిందితులు కుప్పని వంశీ, ఇరుగుళం గ్రామానికి చెందిన నందకుమార్ కుమారుడు సంజయ్, విజయపురం మండలం ఆలపాకం గ్రామానికి చెందిన దేవి ప్రియలను స్థానిక పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి రెండు ద్విచక్ర వాహనాలు, మూడు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసు కున్నారు. నాగలాపురం మండలం రాజుల కండ్రిగ గ్రామానికి చెందిన చంద్రశేఖర్ ఫిబ్రవరి 23వ తేదీన రాత్రి 10 గంట సమయంలో కత్తితో దాడి చేసి 1500 రూపాయలు నగదు, మొబైల్ ఫోను లాక్కొని పరారయ్యారు. దీనిపై బాధితుడు చంద్రశేఖర్ ఇచ్చిన ఫిర్యాదు పోలీసులు కుప్పారావు, నరేష్, సాయి, మహేష్ బృందం దర్యాప్తు చేసి పట్టుకున్నారని తెలిపారు. శనివారం సత్యవేడు పట్టణం ఉలవచేనుకు సమీపం లో నిందితులు ముగ్గురిని అదుపులోకి తీసుకున్నా మన్నారు. 2024 ఏప్రిల్ 10వ తేదీ మలవారి పాలెం టౌన్ షిప్ కాలనీలో ఓ దొంగతనం సంబంధించి శ్రీసిటీ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు అయిందని, ఈ క్రమంలో నిందితులను విచారించగా రంగనాథపురం సమీపంలో జరిగిన దారిదోపిడి, మల వారి పాలెం టౌన్‌షిప్‌లో జరిగిన చోరీకి సంబంధించి నిందితుల పాత్ర ఉన్నట్టు విచారణలో తేలిందన్నారు. ఈ నేపథ్యంలో లక్షా 25 వేల రూపాయలు విలువ చేసే రెండు ద్విచక్ర వాహనాలు, మూడు మొబైల్ ఫోన్స్, కత్తిని స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను కోర్టులో హాజరపరిచి రిమాండుకు పంపుతున్నా మన్నారు. ఈ కేసును ఛేదించిన పలువురు పోలీసులకు సీఐ దివాకర్ రెడ్డి నగదు ప్రోత్సాహక బహుమతులు అందించారు.

తాగునీటి సమస్యలు లేకుండా చూడాలి: ఎంపిడివో


ప్రజాశక్తి -వెంకటగిరి రూరల్: మండలంలో ఎక్కడా తాగునీటి సమస్యలు కనిపించ కూడదని ఎంపిడివో నీలకంఠేశ్వరరావు గ్రామ పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. వెంకటగిరి మండల ప్రజాపరిషత్ కార్యాల యంలో సర్వసభ్యసమావేశం ఎంపిపి తంబిరెడ్డి తనూజరెడ్డి అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సమావేశంలో అన్ని శాఖాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎంపిడిఓ నీలకంఠేశ్వరరావ్ మాట్లాడుతూ మండలంలో ఎక్కడా తాగునీటి సమస్యలు కనిపించకూడదని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. ఎండల వల్ల పెద్దలు, పిల్లలు నీళ్లు ఎక్కువ తాగాలని, తగు జాగ్రత్తలను పాటించాలని కోరారు. విద్యార్థులు వేసవి సెలవుల్లో చెరువులు, గుంతలలో మునగడానికి వెళ్లకుండా వారి తల్లిదండ్రులు దృష్టి పెట్టాలని తెలిపారు. ఈ సందర్భం గా జికె పల్లి పిహెచ్‌సి డాక్టర్ భాస్కరరావు మాట్లాడుతూ ఎండలకు పిల్లలు, పెద్దలు జాగ్రతగా ఉండాలని అధిక ఉష్ణోగ్రత ఉండడం వల్ల వడదెబ్బ తగిలే అవకాశాలు ఎక్కువ గా ఉన్నాయన్నారు. తమ వైద్య సిబ్బంది ద్వారా ఒవరేస్ ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని పంచాయతీల సర్పంచు లు, ఎంపిటిసిలు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.











ఇంటర్‌లో 'శ్రీ వేమ' ప్రభంజనం



ప్రజాశక్తి-నాయుడుపేట: ఇంటర్ ప్రథమ, ద్వితీయ ఇంటర్ ఫలితాల్లో నాయుడుపేట శ్రీ వేమ జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించి ప్రభంజనం సృష్టించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ కళాశాల కరస్పాండెంట్ పి శ్రీనివాసులు రెడ్డి ఇంటర్ ఫలితాల వివరాలు వెల్లడించారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీలో వి జోషిత వెయ్యి మార్కులకు 981 మార్కులు, బి అభిషేక్ 979, కే పవన్ 974, సి ఎన్ ఆదిత్య 973, విరోహిత 972 మార్కులతో అత్యుత్తమ ఫలితాలు సాధించారని తెలిపారు. సీనియర్ ఇంటర్ బైపీసీలో ఎం హాసిని వెయ్యి మార్కులకు 952 మార్కులు, టి కీర్తి సంతోషిని 939, ఆర్ సుహిత 915, ఏ ప్రదీప్ కుమార్ 909 మార్కులు సాధించారని తెలిపారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీలో కే శ్రావణ్ కుమార్ రెడ్డి 470 మార్కులకు 459 మార్కులు, జి భాగ్యశ్రీ 458, ఎం జస్వంత్ 457, బి లక్ష్మీ ప్రసూన 456, కె తనిష్క 456, పి రోహిణి 455, పి యమున యశస్విని 455, పి చరణ్ తేజ 453, ఎంపీ దాత్రి శ్రీ 452, ఇ లేఖశ్రీ 451, యు ముని చైతన్య 450 మార్కులు సాధించారని తెలిపారు. జూనియర్ ఇంటర్ బైపీసీలో ఎం.శాంభవి 440 మార్కులకు 398 మార్కులు, కె.నందిత చౌదరి 397 మార్కులు సాధించారని తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థిని విద్యార్థులకు నగదు బహుమతులు అందించి అభినందనలు తెలిపారు.

టిడిపి నేతలకు సన్మానం

ప్రజాశక్తి- తిరుపతి డెస్క్: పాకాల మండలంలోని స్థానిక దినసరి మార్కెట్ యార్డ్ సమీపంలో ఉన్న టిడిపి కార్యాలయంలో మాజీ వైస్ ఎంపీపీ తలారి బాలశంకర్, గాదంకి మాజీ ఎంపీటీసీ ఇరుగు గురుమూర్తి, డిఎస్ఎస్ అధ్యక్షుడు జింకలమిట్ట చంద్రశేఖర్‌లు టిడిపిలో చేరిన సందర్భంగా పాకాల టిడిపి నాయకులు శనివారం పూలమాల వేసి, శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ టిడిపి చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో టిడిపిలో చేరారని తెలిపారు. ఈ ఎన్నికల్లో తమ వంతు పార్టీ విజయానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

భవన నిర్మాణానికి భూమి పూజ

ప్రజాశక్తి - క్యాంపస్ : ఎన్సిసి గ్రూప్ తిరుపతి 1963 నుండి తిరుపతిలో ప్రస్తుత స్థానంలో ఉంది. ఎన్సిసి శిక్షణా షెడ్యూల్‌లో కీలకమైన వివిధ శిక్షణా కార్యకలాపాలు తిరుపతి గ్రూప్‌లోని వివిధ యూనిట్లచే నిర్వహించబడుతున్నాయి. క్యాడెట్ జీవనానికి సంబంధించి క్యాంపు కార్యకలాపాలకు స్వాభావికమైన వసతి లేకుండా ఎల్లప్పుడూ సవాలుగా ఉండేది. దీర్ఘకాలంగా ఉన్న ఈసమస్యను పరిష్కరించేందుకు ఎన్‌సిసి నగర్ ప్రాంగణంలో క్యాడెట్ నివాసం ఏర్పాటు చేయబడింది. ఎన్‌సిసి నగర్‌లో క్యాడెట్ నివాసం 2500 చదరపు అడుగుల విస్తీర్ణంలో రూ.30 లక్షల అంచనా వ్యయంతో నిర్మిస్తున్నారు. అమరరాజా గ్రూప్‌కు చెందిన సిఎస్ఆర్ ఆర్మ్ రాజన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ ప్రాజెక్టును ప్రతిష్టాత్మకంగా చేపట్టారు. తిరుపతిలోని ఎన్‌సిసి నగర్‌లో నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అమరరాజా గ్రూప్ చైర్మన్ డాక్టర్ రామచంద్ర నాయుడు గల్లా హాజరయ్యారు. గౌరవ అతిథిగా ఏపీ, తెలంగాణ డైరెక్టరేట్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎయిర్ కమోడోర్ వీఎం రెడ్డి, కల్నల్ యోగేష్ దుంగరకేటి హాజరయ్యారు. ఎన్‌సిసి గ్రూప్ తిరుపతి కమాండర్, ఎన్‌సిసి తిరుపతి గ్రూప్ మొత్తం బృందం ఆతిథ్యం ఇచ్చింది. ఆర్‌డిసి 2024లో జూనియర్ డివిజన్ విభాగంలో బెస్ట్ క్యాడెట్ ట్రోఫీని గెలుచుకున్న తిరుపతి గ్రూప్‌కు చెందిన 29 (ఎ) బి, ఎన్‌సిసికి చెందిన సార్జంట్ శ్రీశాంత్‌ను అమర రాజా గ్రూప్ చైర్మన్ కూడా సత్కరించారు. ఎన్‌సిసి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బ్రెయిన్‌డెడ్ మహిళ గుండె 'పదిలం'

పద్మావతి హృదయాలయంకు గుండె, స్విమ్స్‌కు లివర్
వరుసగా 14వ గుండె మార్పిడి విజయవంతం

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: తాను చనిపోతూ మరో ముగ్గురి



ప్రాణాలను కాపాడింది ఓ యువతి. వివరాల్లోకెళితే ప్రొద్దుటూరుకు చెందిన కృష్ణవేణి (28) ప్రమాదవశాత్తు తలకు బలమైన గాయం తగలడంతో కర్నూలు కిమ్స్ హాస్పిటల్‌లో చేర్పించారు వారి కుటుంబ సభ్యులు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు బ్రెయిన్‌డెడ్‌గా నిర్ధారించారు. దీంతో కృష్ణవేణి కుటుంబ సభ్యులు అవయవ దానంకు ముందుకు రావడంతో వైద్యులు కిడ్నీని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి, తిరుపతి పద్మావతి హృదయాలయంకు గుండెను తరలించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఈ మేరకు ప్రభుత్వం వెంటనే చొరవ తీసుకొని ప్రత్యేక హెలికాప్టర్‌ను ఏర్పాటు చేసి కర్నూలు నుంచి తిరుపతి విమానాశ్రయంకు గుండెను తరలించడం జరిగింది. రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న గుండెను, లివర్‌ను గ్రీన్ ఛానల్ ద్వారా 12.30 గంటల కల్లా గ్రీన్ ఛానల్ ద్వారా గుండెను శ్రీ పద్మావతి హృదయంకు, లివర్ ను స్విమ్స్ హాస్పిటల్‌కి చేర్చారు. అప్పటికే హృదయాలయ ఆసుపత్రిలో అన్ని ఏర్పాటులతో సిద్ధంగా ఉన్న డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథ్ రెడ్డి వైద్య బృందం వెంటనే ఆపరేషన్ ప్రారంభించారు.

48 వ్యక్తికి 38 ఏళ్ల యువత గుండె

48 ఏళ్ల వ్యక్తికి 38 ఏళ్ల యువతి గుండెను విజయవంతంగా అమర్చారు. శ్రీపద్మావతి హృదయాలయ ఆసుపత్రిలో గత 42 రోజులుగా గుండె జబ్బుతో బాధపడుతూ చికిత్స పొందుతున్న కృష్ణాజిల్లా కొత్తగూడెంకు చెందిన బాబురావు (48)కు పొద్దుటూరుకు చెందిన కృష్ణవేణి (38) గుండెను డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథ్ రెడ్డి వైద్య బృందం దాదాపు 7 గంటల పాటు శ్రమించి విజయవంతంగా అమర్చారు. దీంతో హృదయాలయ ఆసుపత్రిలో వరుసగా 14వ గుండె మార్పిడి ఆపరేషన్ విజయవంతంగా నిర్వహించడం జరిగింది.

'టిఎంఆర్' జూనియర్ కళాశాల విద్యార్థుల విజయభేరి

ప్రజాశక్తి-నాయుడుపేట: ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో నాయుడుపేట టీఎంఆర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించి విజయభేరి మోగించారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆ కళాశాల కరస్పాండెంట్ తంబిరెడ్డి మనోహర్ రెడ్డి ఇంటర్ ఫలితాల వివరాలు వెల్లడించారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీలో కే లావణ్య లహరి వెయ్యి మార్కులకు 982 మార్కులు సాధించినట్లు తెలిపారు. వి దేశ్మిత 979, షేక్ సుమియా 976, టి జాహ్నవి 975 మార్కులతో ఉత్తమ ఫలితాలు సాధించారన్నారు. సీనియర్ బైపిసిలో షేక్ రీనాజ్ 975 మార్కులు, షేక్ సఫాంజున్ 974, ఏ షిఫ్రాబెరైల్ 925 మార్కులు సాధించినట్లు తెలిపారు. జూనియర్ ఇంటర్ బైపీసీలో ఎం గీతిక 459 మార్కులు, పి శ్రీజ 454, బి హాసిని 452, ఏ తన్మయి 451 మార్కులు సాధించినట్లు తెలిపారు. జూనియర్ ఇంటర్ సీఈసీలో కె రాజశ్రీ 435 మార్కులు సాధించారని తెలిపారు. జూనియర్ బైపీసీలో షేక్ నఫి యాంజున్ 440 మార్కులకు 423 మార్కులు సాధించినట్లు తెలిపారు. బి క్యాథరిన్ స్పందన 404 మార్కులు సాధించారన్నారు. తమ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాలలో ఎంపీసీలో 95 శాతం, బైపీసీలో 92 శాతం ఫలితాలు సాధించారని పేర్కొన్నారు. అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థిని, విద్యార్థులకు కరస్పాండెంట్ మనోహర్ రెడ్డి అభినందనలు తెలిపారు. అధ్యాపకులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.



నాయుడుపేట 'టిఎమ్ఆర్' జూనియర్ కళాశాల విద్యార్థులు

తండ్రి ఆశయాలను విస్మరించిన మోసకారి జగన్ రెడ్డి

నగరి నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి పోచారం రాకేష్ రెడ్డి



మాట్లాడుతున్న కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి పోచారం రాకేష్ రెడ్డి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పేద ప్రజల సంక్షేమం కోసం రాష్ట్ర అభివృద్ధి కోసం మాజీ ముఖ్యమంత్రి వైఎస్సార్ రాజశేఖరరెడ్డి ఆశయాలకు తిలోదకాలు ఇచ్చి 'ఒక ఛాన్స్ ఇవ్వండి ' అని ప్రజలను మోసం చేసి అధికారంలోకొచ్చిన జగన్ రెడ్డి ఆయన ఆశయాలను విస్మరించారని నగరి నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి పోచారం రాకేష్ రెడ్డి, వామపక్ష నాయకులు పేర్కొన్నారు. శనివారం పుత్తూరులో నగరి నియోజకవర్గ ఇండియా ఫోరమ్ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రం లో బిజెపి మోడీ, రాష్ట్రంలో జగన్‌మోహన్ రెడ్డి ఇద్దరూ కలిసి పేద ప్రజల కడుపు కొడుతూ కార్పొరేట్ సంస్థలకు, అంబానీ ఆదాని లాంటి బడా బాబులకు కొమ్ముకాస్తూ రాష్ట్ర ప్రజల సొమ్మును కొల్లగొడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్, ఓడ రేవు, బ్యాంకులను ప్రైవేటీకరణ సంస్థలకు ధారాదత్తం చేస్తూ పేద ప్రజలకు తీరని అన్యాయం చేస్తున్నారన్నారు. జగన్‌మోహన్, మోడీ అధికారంలోకి వచ్చాక ప్రాజెక్టులు పూర్తి చేయకుండా పోలవరం, గాలేరు -నగరి హంద్రీ-నీవా, వేణుగోపాల సాగర్ వంటి ప్రాజెక్టులను పూర్తి చేయకుండా అర్ధాంతరంగా వదిలేశారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల పంటలకు సాగునీరు, తాగు నీళ్ల లేకుండా అన్యాయం చేస్తున్నారన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, రైల్వే జోన్, యువతి యువకులకు ఉద్యోగ అవకాశాలు కరువయ్యాయన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి పనులు చేపట్టడంలో విఫలం అయిందని, మద్యం ఏరులై పారుతోందని, గంజాయి విపరీతంగా అక్రమ రవాణా అవుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. ప్రజలకు మంచి పరిపాలన అందించాలని. కాంగ్రెస్ మిత్రపక్షాలతో ఇండియా ఫోరమ్ ఏర్పడిందని అందుకే జగన్ రెడ్డి పాలన పట్ల ప్రజలే కాకుండా వారి సొంత చెల్లెలు కూడా వ్యతిరేకిస్తూ కాంగ్రెస్‌లో చేరి జగన్‌ను గద్దె దించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. నేడు నగరి నియోజకవర్గం పుత్తూరులో ఆదివారం సాయంకాలం స్థానిక కార్వేటి నగర్ రోడ్ లో ఆరు గంటలకు బహిరంగ సభ నిర్వహిస్తారని, కాంగ్రెస్, మిత్రపక్ష పార్టీలు సభను జయప్రదం చేయాలని వారు కోరారు. సిపిఎం నగరి నియోజకవర్గ కార్యదర్శి ఆర్ వెంకటేష్, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు ఏ విజయ్, భాస్కర్, యాసిన్ బాష, పురుషోత్తం, నాయకులు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు కేశవులు, నగరి నాయకులు బాబు, చిరంజీవి, సిపిఐ జిల్లా నాయకులు నాగరాజు, కోదండయ్య, మహేష్, నాయకులు పాల్గొన్నారు.

నారాయణ ప్రభంజనం



G. GREESHMA SREE, Ht. No. 2419121679, M.P.C - 466/470
V. A. GNANESWAR, Ht. No. 2419118777, M.P.C - 466/470
K. VRINDA VYSHNAVI, Ht. No. 2419140780, M.P.C - 466/470
M. AMULYA, Ht. No. 2419142087, M.P.C - 466/470
M SHARANYA, Ht. No. 2419141478, M.P.C - 466/470
P MOULYA SREE, Ht. No. 2419141467, M.P.C - 466/470
R C HIMAVARSHA RI, Ht. No. 241914213, M.P.C - 466/470

ప్రజాశక్తి-తిరుపతి సిటి: ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లా నారాయణ విద్యాసంస్థల విద్యార్తులు అత్యుత్తమ మార్కులతో ప్రభంజనం సృష్టించారని ఆ కళాశాల డిజిఎం కొండలరావు తెలిపారు. స్థానిక ఎంఆర్ పల్లిలోని ఆ కళశాల బ్రాంచ్ ప్రాంగాణంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రథమ సంవత్సరం ఎంపిసి విభాగంలో 7 మంది విద్యార్థులు 470కి 466 మార్కులు సాధించారని, బైపిసి విభాగంలో ఇద్దరు విద్యార్థులు 440కి 435 మార్కులు సాధించారన్నారు. ఎంపిసి విబాగంలో 460కి పైగా 281 మంది, బైపిసి విభాగంలో 430కిపైగా 9 మంది మార్కులు సాధించారని తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించినవిద్యార్తులను అభినందించారు. వారికి సహకరించిన తల్లిదండ్రులు, అధ్యాపకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీన్లు, ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నేదురుమల్లి సమక్షంలో
వైసిపిలో చేరిక

ప్రజాశక్తి- వెంకటగిరి రూరల్ : వెంకటగిరి రూరల్ మండలం ఉప్పలపల్లి, యాతలూరు కలవలపూడి గ్రామాల నుండి టిడిపికి చెందిన పలువురు వైసిపిలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి ఆ పార్టీలోకి నేదురు మల్లి రాం కుమార్ రెడ్డి ఆహ్వానించారు. వైసిపి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు మెచ్చి ప్రతిపక్ష పార్టీ నుంచి వైసిపిలో చేరుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటగిరి రూరల్ మండల అధ్యక్షులు కాల్తి రెడ్డి శ్రీనివాసులు రెడ్డి, రాజా రెడ్డి, పంజం ధనంజయ, జికే పల్లి నాగయ్య, వెంకటేశ్వర్లు, సదానందరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

టిడిపి గెలుపు కోసం
వినూత్న మొక్కులు

ప్రజాశక్తి -రామచంద్రాపురం: రాష్ట్రంలో టిడిపి గెలవాలని చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటూ చంద్రగిరి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి వెంకటమణి ప్రసాద్ (నాని) విజయం సాధించాలని కోరుతూ తిరుపతి రూరల్ మండలం పాడిపేట పంచాయతీలోని శేషాద్రి నగర్, ఎన్టీఆర్ హౌసింగ్ కాలనీకి చెందిన శ్రీనివాసులు శనివారం శ్రీవారి దర్శనానికి మోకాళ్ల మీద శ్రీవారి మెట్ల ద్వారా తిరుమలకు వెళ్లారు. అలిపిరి నడక మార్గంలో మోకాళ్ల మీద కొండకు బయలు దేరే ముందు శ్రీవారి పాదాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. విషయం తెలుసుకున్న టిడిపి యువ నేత పులివర్తి వినీల్ అలిపిరి వద్దకు చేరుకుని కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ రాష్ట్రంలో మళ్లీ వైసీపీ అధికారంలోకి వస్తే రాష్ట్రం అంధకారమవుతుందని రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబుతోనే సాధ్యమని పేర్కొన్నారు.



మోకాళ్లపై తిరుమలకు వెళుతున్నట్లు శ్రీనివాసులు

డంపింగ్ యార్డును పరిశీలించిన సిఐటియు నాయకులు



డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న సిఐటియు నాయకులు గంగరాజు, సురేంద్ర

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చిత్తూరు నగరంలోని డంపింగ్ యార్డు అగ్నిప్రమాదంకు గురై చుట్టూ పొగతో నిండి ప్రజలకు ఇబ్బందికరంగా మారింది. మంటల్ని అదుపులోకి తీసుకొచ్చినప్పటికీ ఎండల తీవ్రత ఎక్కువ ఉండడంతో అడుగుభాగం మండుతూనే ఉన్నది. శనివారం డంపింగ్ యార్డ్‌ను సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సురేంద్రన్, ఉపాధ్యక్షులు వాడ గంగరాజులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కమిషనర్ చొరవ తీసుకుని అధికార యంత్రాంగాను అప్రమత్తం చేసి మంటలను అదుపులోకి తీసుకురావడంతో పెద్ద ప్రమాదం తప్పిందన్నారు. ఎరువు తయారు చేసే బయోప్రాజెక్టు పూర్తిస్థాయిలో రాకపోవడంతో చెత్త రోజుకు పేరుకుపోతున్నది. యంత్రాలు పెట్టినప్పటికీ నిరుపయోగంగా ఉన్నాయన్నారు. పూర్తిస్థాయిలో ఎరువు తయారీ పరిధిలోకి వస్తే ఇలాంటి మంటలు వచ్చే పరిస్థితి లేదు. 15 ఎకరాల విస్తీర్ణం ఉన్న యార్డ్ చుట్టూ ప్రహరీ గోడ లేకపోవడంతో ఎవరు పడితే వాళ్ళు వచ్చి ప్రమాదం ఉంది. ఇక్కడ పనిచేస్తున్న సిబ్బంది కూడా రక్షణ లేని పరిస్థితి. ప్రభుత్వం, కలెక్టర్ చొరవ తీసుకొని బయో ప్రాజెక్టుకు ప్రత్యేకనిధులు కేటాయించి దానిని వెంటనే వినియోగంలోకి తీసుకురావాలని వారు కోరారు. పొగతో చుట్టుపక్కల కాలనీ ప్రజానీకానికి అనారోగ్య సమస్యలు రాకుండా ఆరోగ్య అధికారులు తగు జాగ్రత్తలు తీసుకొని వైద్యపరీక్షలు చేయాలని కోరారు.

మండలంలో థామస్ ప్రచారం



ప్రచారంలో ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ థామస్

ప్రజాశక్తి-వెదురుకుప్పం: మండలంలోని తిరుమలయ్య పల్లి గ్రామ పంచాయతీ భవిష్యత్ గ్యారెంటీ... బాబు ష్యూరిటీ కార్యక్రమంలో భాగంగా శనివారం కుప్పం క్లస్టర్ ఇంచార్జ్ మోహన్ మురళి ఆధ్వర్యంలో మన ఇంటికి మన థామస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ థామస్ పంచాయతీలోని ప్రతి ఇంటికీ వెళ్లి టిడిపి ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలను గురించి వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. పంచాయతీలోని రెంటాలచేను గ్రామానికి చెందిన చించుగుడి మహాభారతం ఆలయ ధర్మకర్త బండి వెంకట రమణారెడ్డి ఆయన అనుచరులతో థామస్ సమక్షంలో టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. వారికి టిడిపి కండువాలు వేసి థామస్ సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.

రేపు షర్మిల బహిరంగ సభ

ప్రజాశక్తి - గంగాధరనెల్లూరు

ఈనెల 15వ తేదీన ఉదయం 10గంటలకు కార్వేటినగరంలో జరిగే పీసీసీ అధ్యక్షురాలు షర్మిల బహిరంగ సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి రమేష్ బాబు శనివారం ఓ ప్రకటనలో కోరారు. ఈ సభకు నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నేతలు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

మధు అండ్ శ్రావణి జూనియర్ విజయదుందుభి



ప్రజాశక్తి -గంగవరం: ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ పరీక్ష ఫలితాలలో మధు అండ్ శ్రావణి జూనియర్ విద్యాసంస్థలు రాష్ట్రస్థాయిలో మార్కులతో పాటు అత్యధిక ఉత్తీర్ణత శాతాన్ని సాధించారని కళాశాల కరస్పాండెంట్ సిపి. బాల సుందరంరెడ్డి తెలిపారు. మొదటి సంవత్సరం ఎంపిసిలో ఎం.చేతన్ 470 మార్కులకు గాను 465, ఎస్.కరిష్మా 463, ఎస్. రోషిని 459 మార్కులు సాధించగా బైపిసిలో ఐకె.రోషిణి 440 మార్కులకు గాను 434, బి.జయశ్రీ 434, ఎస్. అల్టీస్ 429 సాధించినట్లు తెలిపారు. సిఈసిలో ఎస్. ఫిజా అంజుమ్ 500లకు గాను 486 మార్కులు, ఎస్‌కె.నిహా 460, పి.పవిత్ర 450 మార్కులు సాధించినట్లు పేర్కొన్నారు. అలాగే రెండో సంవత్సరం ఎంపిసిలో ఎం. గంగా 1000 మార్కులకు గాను 982, ఆర్.వర్షిత 981, జిఆర్.లక్ష్మీ ప్రియా 965 మార్కులు సాధించగా బైపిసిలో ఎస్.అఫ్రా 1000 మార్కులకు గాను 980, డి.నీతూ 976, జి. జయంతి 968 సాధించారు. సిఈసిలో ఎస్. హుస్నా అలీమా 1000 మార్కులకు గాను 956, ఎస్.సమీనా 949 సాధించినట్లు తెలిపారు. ఈ ఫలితాలలో ప్రథమ సంవత్సరంలో 400 మార్కులుపైగా 70 మంది, ద్వితీయ సంవత్సరంలో 900 మార్కులపైగా 55 మంది విద్యార్థులు సాధించారని తెలిపారు. ఈ ఘన విజయానికి కారణం అయినటువంటి విద్యార్థులు, అధ్యాపక బృందాను కళాశాల యాజమాన్యం కె.కృష్ణమూర్తి రెడ్డి, సిపి.శ్రీవాణి అభినందించారు.

'విజ్ఞాన్' విజయకేతనం

77శాతం ఉత్తీర్ణత : కరస్పాండెంట్ వెంకటాచలం



ప్రజాశక్తి- చిత్తూరు డెస్క్: బంగారుపాళ్యం మండలంలోని విజ్ఞాన్ జూనియర్ కళాశాల విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. శుక్రవారం విడుదలైన ఇంటర్మీడియెట్ జూనియర్, సీనియర్ ఫలితాలలో విజ్ఞాన్ కాలేజీలో ప్రథమ సంవత్సరం లో 73శాతం ద్వితీయ సంవత్సరంలో 77 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు కరస్పాండెంట్ వెంకటాచలం తెలిపారు. ఫస్ట్ ఇయర్ సైన్స్ విభాగంలో ఎస్.గాయత్రి 470 మార్కులకు గాను 429, ఆర్ట్సులో బి.స్వాతి 500ల మార్కులకు గాను 444 మార్కులు సాధించినట్లు తెలిపారు. అలాగే ద్వితీయ సంవత్సరంలో సైన్స్‌లో ఎస్.రాజరాజేశ్వరి 1000 మార్కులకు గాను 939 మార్కులు సాధించి మండలస్థాయిలో మొదటి ర్యాంకుతోపాటు అత్యధిక మార్కులతో ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు. వీరికి శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు.

ఐక్యంగా పనిచేయండి

చిత్తూరు పార్లమెంటు అభ్యర్థి దగ్గుమళ్ళ ప్రసాద్ రావు



ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: 2024 సార్వత్రిక ఎన్నికల్లో గంగాధర నెల్లూరుకు సంబంధించిన నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేసి తెలుగుదేశం పార్టీని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని, ఆ నియోజకవర్గం తెలుగు తమ్ముళ్లకు దిశానిర్దేశం చేశారు ఎన్డీఏ కూటమి చిత్తూరు పార్లమెంట్ అభ్యర్థి దగ్గుమల్ల ప్రసాదరావు. శనివారం చిత్తూరులోని ఎన్డీఏ కూటమి చిత్తూరు పార్లమెంట్ అభ్యర్థి కార్యాలయంలో దగ్గుమల ప్రసాదరావు గంగాధర నెల్లూరు నాయకులు, కార్యకర్తలతో సమావేశం అయ్యారు. చంద్రబాబు నాయుడు ఆదేశాలకు అనుగుణంగా తామంతా పనిచేయాలని సూచించారు. ప్రజాసంక్షేమం కోరి రూపొందించిన సూపర్ సిక్స్ పథకాలపై జీడి నెలలు ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని తెలియజేశారు. కార్యకర్తలకు తాను ఎప్పుడూ అందుబాటులో ఉంటానని, ఏదైనా ఇబ్బందులు ఉంటే తనతో చర్చించి సమస్యలను పరిష్కరించుకోవచ్చునని అన్నారు. ఎన్డీఏ కూటమి బలపరిచిన అభ్యర్థుల గెలిపే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. పెనుమూరు టిడిపి మండల అధ్యక్షులు రుద్రయ్య నాయుడు, రాష్ట్ర కార్యదర్శి లోకనాథ నాయుడు, పార్లమెంటు తెలుగు మహిళా అధ్యక్షురాలు అరుణ, ఇందిరమ్మ, ఎస్ఆర్ పురం మండల అధ్యక్షుడు జయశంకర్ నాయుడు, పాలసముద్రం మండల అధ్యక్షుడు రాజేంద్ర, కార్వేటినగరం మండల అధ్యక్షుడు చంగల్రాయ యాదవ్, గంగాధర నెల్లూరు మండల పార్టీ అధ్యక్షుడు స్వామిదాసు, టిడిపి జిల్లా కార్యదర్శులు రాజశేఖర్ నాయుడు, రెడ్డప్ప, శ్రీధర్ పాల్గొన్నారు.

దేశభక్తులు, దేశద్రోహుల మధ్య జరుగుతున్న యుద్ధం

ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించండి



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరులో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఇండియా కూటమి అభ్యర్థి శివశంకర్‌ను గెలిపించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల్లో దేశభక్తులకు దేశద్రోహుల మధ్య జరుగుతున్న యుద్ధంలో మతోన్మాద శక్తులను ఓడించడానికి ఇండియా కూటమి ఏర్పడిందన్నారు. ఆ కూటమి ఆధ్వర్యంలో రాష్ట్రంలో కూడా ప్రత్యేక హోదా కోసం అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్నారని అందులో భాగంగా చిత్తూరు జిల్లా పలమనేరులో కూటమి అభ్యర్థి శివశంకర్ పోటీ చేస్తున్నారని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం కూటమి తరపున చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికే సిపిఎం ఆధ్వర్యంలో పలమనేరు ప్రాంతంలో అనేక రకాల పోరాటాలు చేసి ప్రజలకు అండగా నిలిచిందన్నారు. రైతుల సమస్యలపై, కార్మికుల సమస్యలపై, బడుగు పేదవర్గాల సమస్యలపై, మహిళలపై జరుగుతున్న దాడులపై, కరెంట్ అలాగే ఉంటది టెక్స్టైల్ పార్క్ ఏర్పాటు చేయాలని అనేక పోరాటాలు నడిపిన సిపిఎం బలపరుస్తున్న అభ్యర్థి శివశంకర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. దేశంలో బ్రిటీష్ పరిపాలన పోవాలని స్వాతంత్ర పోరాటంలో పాల్గొన్న పార్టీలు కాంగ్రెస్, కమ్యూనిస్టులు మాత్రమేనని అలాంటి పార్టీలు ఐక్యంగా మరో స్వాతంత్ర పోరాటం కోసం నడుం బిగించాయని అందరూ బలపరిచి కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు భాస్కర్, నియోజకవర్గం అభ్యర్థి శివశంకర్, సిపిఎం నాయకులు ఓబుల్ రాజు, గిరిధర్ గుప్తా, భువనేశ్వరి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

వైసిపి పాలనలో రాష్ట్రం రావణ కాష్టం

ఇంటింటా ప్రచారంలో గురజాల



ఇంటింటా ప్రచారంలో గురజాల జగన్మోహన్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: వైసీపీ పాలనలో రాష్ట్రం రావణ కాష్టంలా మారిందని టిడిపి అభ్యర్థి గురజాల జగన్మోహన్ అన్నారు. శనివారం చిత్తూరు రూరల్ మండలంలోని చెన్నసముద్రం, నాయనిచెరువు, దిగువూరు, కొట్టంఇండ్లు, అడవిచెను, పెద్దిసెట్టిపల్లి, తుమ్మింద పాల్యం, ఎస్టీ కాలనీ, ఎస్సీ కాలని గ్రామాల్లో ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన వెంట బిజేపీ నేతలు దుర్గా రామకృష్ణ, అట్లూరి శ్రీనివాసులు, జనసేన అసెంబ్లీ ఇంచార్జి దయారం, టిడిపి సీనియర్ నేత చంద్రప్రకాష్, సర్పంచ్ మునిరత్నం ఉన్నారు. టిడిపి మ్యానిఫెస్టోలోని సూపర్ 6 పథకాలను వివరిస్తూ గెలిపించాలని కోరారు. మాజీ ఎంపీటీసీ కాశీ, మాజీ సర్పంచ్‌లు మాణిక్యమ్మ, దామోదరం, రఘు, టిడిపి, జనసేన మండల అధ్యక్షులు శేఖర్ బాబు, మోహన్ పాల్గొన్నారు.

మట్టిలో మాణిక్యం భవ్య

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం

గ్రామీణ వ్యవసాయ కుటుంబంలో పుట్టిన భవ్య మట్టిలో మాణిక్యంలా రాణించింది. విద్యతోపాటు వ్యవసాయంలోనూ తల్లిదండ్రులకు చేదోడు వాదోడుగా ఉంటూ స్వశక్తితో చదివి ఇంటర్మీడియట్ చిత్తూరులో వివేకానంద జూనియర్ కాలేజ్ ద్వితీయ సంవత్సరంలో 470 మార్కులకు గాను 456 మార్కులు సాధించింది. బోడిదేవర పల్లి జయప్రద హరిబాబు నాయుడు కుమార్తె భవ్య అత్యధిక మార్కు సాధించడంతో పిల్లిగుండ్లపల్లి వాటర్షెడ్ మాజీ చైర్మన్ తాత గుణశేఖర్ నాయుడు గ్రామంలో ఆనంద ఉత్సవాలు నిర్వహించారు.

టిడిపి ఈడిగ గౌడ బీసీ సాధికార సమితి

పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- ఐరాల: చిత్తూరు పార్లమెంటు టిడిపి ఈడిగ గౌడ బీసీ సాధికార పోస్టర్‌ను పూతలపట్టు టిడిపి జనసేన, బిజేపి ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ కలికిరి మురళీమోహన్ ఆవిష్కరించారు. శనివారం ఈడిగ సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా ఆయన నివాసంలో కలిసి శాలువతో సత్కరించారు. అనంతరం మురళీమోహన్ చేతుల మీదుగా చిత్తూరు పార్లమెంటు టిడిపి ఈడిగ గౌడ బీసీ సాధికార సమితి పోస్టర్‌ను గౌడ సంఘం నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మురళి మోహన్ మాట్లాడుతూ ఈడిగ గౌడ బీసీల అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వైసిపి ప్రభుత్వం 75వేల కోట్ల సబ్‌ప్లాన్ నిధులు దారి మళ్ళించిందన్నారు. తెలుగుదేశం పార్టీ గెలుపుకు బీసీ అందరూ కృషి చేయాలని మురళిమోహన్ కోరారు. చిత్తూరు జిల్లా గౌడ సంఘం అధ్యక్షులు బుస్సా నాగరాజులు, మండల గౌడ సంఘం అధ్యక్షులు గిరి, ఉపాధ్యక్షులు భార్గవ్, జిల్లా గౌడ సంఘం నాయకులు రెడ్డప్ప పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మురళీమోహన్

గురుకుల ఇంటర్ ప్రవేశ పరీక్షకు 290 మంది హాజరు

ప్రజాశక్తి -దొరవారిసత్రం : రాష్ట్రంలోని వెనుక బడిన తరగతుల గురుకుల కళాశాలలైన మహాత్మ జ్యోతిబాపూలే కళాశాలలో ఇంటర్ విద్య ప్రవేశానికి శనివారం ఇంటర్ సెట్ పరీక్షలు దొరవారిసత్రం గురుకులంలో నిర్వహించారు. ఈ ప్రవేశ పరీక్షకు రాష్ట్రంలో ఉన్న 18 గురుకులాల్లో ఇంటర్ ప్రవేశానికి 290 మంది విద్యార్థిని విద్యార్థులు పలు జిల్లాల నుండి హాజరయ్యారు. స్థానిక ప్రిన్సిపాల్ తిరుపతయ్య విద్యార్థులకు పరీక్ష విధానంపై పలు సూచనలు చేశారు. అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించారు. ప్రవేశ పరీక్ష నిర్వహణ చీఫ్ అధికారిగా వెంకటగిరి గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ పాండురంగయ్య పర్యవేక్షించారు. స్థానిక ప్రిన్సిపాల్, చీఫ్‌లతో చర్చించి ఈ పరీక్షా కేంద్రాన్ని, పరీక్ష తీరును, విద్యార్థులకు ఏర్పాటు చేసిన సౌకర్యాలను తిరుపతి జిల్లా బిసి వెల్ఫేర్ అధికారి భాస్కర్ రెడ్డి, ఏజిఓ అప్పారావు, పరీక్షా కేంద్రాన్ని పరిశీలించారు. ఎస్ఐ తిరుమల రావు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. వేసవి కావడంతో విద్యార్థులకు ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యగా వైద్య సిబ్బంది అవసరమైన ఓఆర్ఎస్ ప్యాకెట్స్, పలు రకాల మందులతో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్ఎం శ్రావణి, కళాశాల స్టాఫ్ నర్స్ మౌనిష, రెడ్డమ్మ, ఆశ మంజుల హాజరయ్యారు.



విద్యార్థులకు సూచనలు ఇస్తున్న పరీక్షల చీఫ్ అధికారి, పోలీసులు

ఎమరాల్డ్స్ విద్యార్థికి బెస్ట్ స్పీకర్ అవార్డు



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): కేరళ రాష్ట్రం కొచ్చిన్ లో ఇటీవల జరిగిన మరియా ఫిలిప్ ఫ్యూచర్ లీడర్స్ డిబేట్ పోటీలలో తిరుపతి నగరానికి చెందిన ఎమరాల్డ్స్ డిగ్రీ కళాశాల ఫైనల్ ఇయర్ బిబిఏ చదువుతున్న కె. విజయ్ కుమార్ అత్యుత్తమ ప్రతిభ కనబరచి బెస్ట్ స్పీకర్ అవార్డ్ సాధించి రూ.25 వేలు నగదు బహుమతిని, షీల్డ్ సాధించినట్లు కళాశాల ఉప సంచాలకులు మునిరత్నం తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ఎమరాల్డ్స్ సంచాలకులు గిరిధర్, విశ్వనాథ్ మాట్లాడుతూ తమ కళాశాలలోని నాణ్యతతో కూడిన విద్యా ప్రమాణాలకు నిదర్శనమే తమ విద్యార్థులు సాధిస్తున్న విజయాలు అన్నారు. ఈ కార్యక్రమంలో జాషువా భానుకిరణ్, గ్రేస్ వినీల, సుధాకర్, వసుంధర, అమ్మాజి, ప్రిన్సిపల్ జాఫర్ వల్లీ పాల్గొన్నారు.

జగన్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం

- గూడూరు ఎమ్మెల్యే అభ్యర్థి మేరిగ మురళీధర్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : జగన్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని వైసీపీ గూడూరు నియోజకవర్గ అభ్యర్థి మేరిగ మురళీధర్ పేర్కొన్నారు. ఆయన వైసిపి తిరుపతి ఎంపీ అభ్యర్థి మద్దిల గురుమూర్తితో కలిసి శనివారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. గూడూరు పట్టణంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపి అభ్యర్థి గురుమూర్తి, ఎన్నికల నియోజక వర్గ పరిశీలకులు ఎంఅర్‌సి రెడ్డి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పోణకా దేవసేనమ్మ, వైసీపీ సీనియర్ నాయకులు చేవురూ విజయమోహన్ రెడ్డి , ఎల్లసిరి గోపాల్ రెడ్డి , మల్లు విజయ కుమార్ రెడ్డి , యాద్దల నరేంద్ర రెడ్డి , బొమ్మిడి శ్రీనివాసులు, వాయుగుండ్ల నాగరాజు, జెడ్పీటిసి యామిని, ఎంపిపి గురవయ్య , నియోజక వర్గ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అభ్యర్థులను అనర్హులుగా ప్రకటించాలి

స్థానిక ఎమ్మెల్యే అభ్యర్థి రంగూన్ శంకర్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): అధికారాన్ని అడ్డుపెట్టుకుని వారసత్వ రాజకీయాలను పెంపొందించుకోవడానికి చూస్తున్న వారిని ఎమ్మెల్యే అభ్యర్థిత్వం నుండి అనర్హులుగా ప్రకటించాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ కు తిరుపతి స్థానిక ఎమ్మెల్యే అభ్యర్థి రంగూన్ శంకర్ డిమాండ్ చేశారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తిరుపతిలో శాసనసభ్యుడిగా, టీటీడీ ఛైర్మన్ గా పదవుల్లో ఉన్న భూమన కరుణాకర్ రెడ్డి ఆయన కుమారుడి గెలుపు కోసం ప్రచారం చేయడం వారి అనర్హతకు వర్తించదా? అని ప్రశ్నించారు. చిత్తూరులో వైసిపి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించిన ఆరని శ్రీనివాసులు ఇప్పుడు జనసేనలో చేరి తిరుపతి ప్రజలను ఓట్లు అడగడం అనైతిక అభ్యర్థన కాదా? అని ప్రశ్నించారు. ఈ పరిణామాలపై రాష్ట్ర ఎన్నికల సంఘానికి స్వతంత్ర అభ్యర్థిగా తాను ఫిర్యాదు చేస్తున్నామన్నారు.

విశ్వం విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - క్యాంపస్ :తిరుపతి జీవకోనలోని విశ్వం హై స్కూలులో జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం, విశ్వం స్కూల్ వినియోగదారుల క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లాస్థాయిలో 'వినియోగదారుల హక్కులు బాధ్యతలు' అని అంశంపై వ్యాసరచన, వకృత్వ పోటీలను నిర్వహించి గెలుపొందిన విజేతలకు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారని విశ్వం విద్యా సంస్థల అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వ చందన్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వినియోగదారుల సంఘం అధ్యక్షులు పి.రాజారెడ్డి, జిల్లా కార్యదర్శి ఎం.శ్రీనివాసులు,దేవేంద్ర తదితరులు పాల్గొని మాట్లాడుతూ వినియోగదారుల హక్కులపై అవగాహనతో బాధ్యతగా, నాణ్యతా ప్రమాణాలు ,సేవా లోపాలకు ప్రశ్నించే తత్వం అలవాటు చేసుకోవాలని ,ప్రతి విద్యార్థి చైతన్యవంతులై సమాజాన్ని చైతన్యం చేయడానికి కృషి చేయాలని కోరారు,

ఎన్నికల నిర్వహణలో సెక్టర్ ఆఫీసర్ల పాత్ర కీలకం

చిత్తూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జేసీ పి. శ్రీనివాసులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో సెక్టర్ ఆఫీసర్లు, రూట్ ఆఫీసర్ల పాత్ర ఎంతో కీలకమని చిత్తూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జేసీ పి. శ్రీనివాసులు చెప్పారు. సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు సంబంధించి నియోజకవర్గ పరిధిలోని సెక్టార్ ఆఫీసర్లు, రూట్ ఆఫీసర్లు, మాస్టర్ ట్రైనర్లకు శనివారం నగరపాలక కార్యాలయంలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఏఆర్వో కమిషనర్ డాక్టర జె.అరుణ, ఆర్డీవో చిన్నయ్య, పలమనేరు ఆర్డీవో మనోజ్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణ, కోడ్ అమలు, పోలింగ్ రోజు నిర్వహించాల్సిన విధులపై అవగాహన పెంచుకోవాలన్నారు. సెక్టార్ అధికారులు రానున్న నెలరోజుల పాటు పూర్తిగా ఎన్నికల విధులపై దష్టి సారించాలన్నారు. కేటాయించిన పోలింగ్ కేంద్రాలను ప్రతిరోజు పరిశీలించాలన్నారు. కేంద్రం పరిధిలోని అధికారులు, సిబ్బందిని సమన్వయం చేసుకోని కమ్యూనికేషన్ ప్లాన్‌ను పక్కగా అమలు చేయాలన్నారు. పోలింగ్ రోజున ఎలాంటి సమస్యలు తలెత్తుతాయి? శాంతి భద్రత సమస్యలు, ఈవీఎం సమస్యలు, పోలింగ్ సిబ్బందిని సమన్వయం చేసుకోవడంపై ఉదాహరణలతో వివరించారు. ఎన్నికల విధుల్లో ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం ఇవ్వవద్దన్నారు. పోలింగ్ రోజున సమర్పించాల్సిన రిపోర్టులపై అవగాహన పెంచుకోవాలన్నారు. సెక్టార్ అధికారులు పీవో, ఏపీఓల హ్యాండ్ పుస్తకాలను చదివి అవగాహన పెంచుకోవాలన్నారు. పోలింగ్ రోజు పర్యవేక్షించాల్సిన అంశాలు, సమర్పించాల్సిన రిపోర్టులు, రిసెప్షన్ సెంటర్, రిసీవింగ్ సెంటర్ల నిర్వహణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ అధికారులు, రూట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

ఏపీ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థి జేఏసీ డిమాండు

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతి జిల్లాలోని బాలాజీ కాలనీలో చట్ట వ్యతిరేకంగా కార్తీ వెట్ ఫార్మసీ, శాన్వి పెట్ క్లినిక్ నిర్వహిస్తూ మూగజీవులు జీవించే హక్కుని కాల రాస్తున్న యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని మార్చి28 వ తేదీన డ్రగ్ ఇన్‌స్పెక్టరుకి ఫిర్యాదు చేశామని, ఇంత వరకు డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కార్తీ వెట్ ఫార్మసీ పై చర్యలు తీసుకోలేదని, కార్తీ వెట్ ఫార్మసీ యాజమాన్యంకి డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కి మధ్య పలు అనుమానాలు ఉన్నాయని తక్షణమే పై స్థాయి అధికారులు జోక్యం చేసుకొని విచారణ జరిపించి మూగజీవుల ప్రాణాలు కాపాడాలని ఏపీ బీసీ, ఎస్‌సీ, ఎస్‌టి, మైనార్టీ విద్యార్థి జేఏసీ నాయకులు కోరారు. తిరుపతి స్థానిక అంబేద్కర్ భవన్ విద్యార్థి సంఘ నాయకుల రౌండ్ టేబుల్ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వెటర్నరీ స్టూడెంట్స్ అండ్ గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ .ఉప్పర నాగేశ్వరరావు, రాయలసీమ బీసీ విద్యార్థి విభాగం అధ్యక్షులు విజయ్ ఉత్తరాది మాట్లాడుతూ తమ శునకాన్ని అర్హత లేని వారిచే వైద్యం, మందులు అమ్మించి మార్చి 25 న కార్తీ వెట్ ఫార్మసీ యాజమాన్యం మృతికి కారకులయ్యారని న్యాయం కోసం పోరాటం చేస్తున్న తమపై రకరకాల నంబర్స్ తో కాల్స్ చేయించి బెదిరింపులకి పాల్పడుతున్నారని వాపోయారు. ప్రముఖ న్యాయవాది పోతులూరి మాసుమయ్యా మాట్లాడుతూ బాలాజీ కాలనీలో విపరీతమైన ట్రాఫిక్ సర్కిల్లో క్లినిక్ అండ్ ఫార్మసీ పర్మిషన్ ఇచ్చిన అధికారుల పై తక్షణమే చర్యలు తీసుకోవాలని, తిరుపతి నగర ప్రజలు ట్రాఫిక్ సమస్యలకి కారణం అవుతున్న కార్తీ వెట్ అండ్ శాన్వి పెట్ క్లినిక్ ని తక్షణమే అక్కడ నుంచి తొలిగించాలని అధికారులని కోరారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య విద్యార్థి సంఘం అధ్యక్షులు డాన్ రాష్ట్ర ఎస్టీ నాయకులు సురేశ్ నాయక్, ఎస్వీ యూనివర్సిటీ బీసీ ఇన్‌ఛార్జి రామంజి, సగర కుల సంఘ యూత్ లీడర్ బాలు సగర, ఇతర విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

జగనన్న లబ్ధిదారుల ఇళ్లు కూల్చివేత

- దౌర్జన్యం.. బాధితుల ఆవేదన
- ఎంఎల్‌ఏ, ఎస్పీ, కలెక్టర్‌కు ఫిర్యాదు



ప్రజాశక్తి- రేణిగుంట : రేణిగుంట పట్టణ ప్రజలు వివేకానంద కాలనీ వద్ద ఉన్న కాలవ పోరంబోకు ఎత్తు భాగంలో నిర్మించుకున్న ఇళ్లను తూకివాకానికి చెందిన కొందరు యువకులు దౌర్జన్యంగా కూల్చి వేశారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. బాధితురాలి కథనం మేరకు రేణిగుంట పట్టణ ప్రజలకు పాగలిలో ఇచ్చిన జగనన్న ఇంటి పట్టాలు కోర్టు పరిధిలో ఉన్నందున వివేకానంద కాలనీ వద్ద ఉన్న కాలువ పోరంబోకు ఎత్తు భాగంలో ఉన్న స్థలంలో ఇల్లు నిర్మించుకున్నామని తెలిపారు. మూడు నెలలుగా ఇళ్లు నిర్మించుకొని కాపురాలు ఉంటున్నామన్నారు. తూకివాకానికి చెందిన వ్యక్తులు ప్రతిరోజూ వచ్చి బెదిరించే వారని బాధితులు వాపోయారు. 'తూకివాకం పంచాయతీ పరిధిలో ఉన్న స్థలంలో ఇళ్లు ఎలా నిర్మించుకుంటారు?' అంటూ బెదిరించేవారని తెలిపారు. సుమారు 200 మంది యువకులు దౌర్జన్యంగా తమపై దాడులకు పాల్పడి జెసిబితో కొందరు యువకులు కర్రలతో తమపై దాడులు చేశారని కన్నీరు మున్నీరై విలపించారు. మహిళలను చూడకుండా కొందరు యువకులు అసభ్యకరంగా ప్రవర్తించారని మీడియా ముందు అమిదా ఆవేదన వ్యక్తం చేసింది. మరో మహిళ తమ ఇళ్లను కూల్చొద్దని ప్రాథేయపడినా ఆమెని తోసివేసే క్రమంలో సొమ్మసిల్లి పడిపోవడంతో 108 సాయంతో ఆసుపత్రికి తరలించారు. మరొక మహిళపై దాడి చేయడంతో గాయాలయ్యాయని బోరుమని వినిపించారు. సంఘటన స్థలానికి చేరుకున్న గాజులమండ్యం పోలీసులు యువకులను అడ్డుకున్నారు. జెసిబిని గాజులమండ్యం ఎస్ఐ సునీల్ సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు.

అక్రమంగా కూల్చివేశారు: సిపిఎం

జగనన్న లబ్ధిదారులు వేసుకున్న ఇళ్లను అక్రమంగా దాడి చేసి దౌర్జన్యంగా కూల్చివేసిన వారిపై శ్రీకాళహస్తి నియోజకవర్గం ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి, జిల్లా ఎస్పీ, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని సిపిఎం రేణిగుంట మండల కార్యదర్శి హరినాథ్ పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ మహిళలని కూడా చూడకుండా మద్యం మత్తులో యువకులు దాడి చేశారని వారి దౌర్జన్యం నశించాలని నినాదాలు చేశారు. రెవెన్యూ అధికారులు ఇళ్లు కూల్చి వేసినా బాధపడే వారం కాదని ఇళ్లు కట్టుకొని నివాసముంటున్న వారిపై దౌర్జన్యంగా దాడి చేసే అధికారం వీళ్లకు ఎవరు ఇచ్చారని ప్రశ్నించారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని దౌర్జన్యంగా దాడులు చేసిన వారిపై చట్టపరమైన కేసులు నమోదు చేసే వరకు ఉద్యమిస్తామని హరినాథ్ తెలిపారు.

నాగేశ్వరికి డాక్టరేట్



ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతీ మహిళా విశ్వ విద్యాలయంలో ఇన్‌స్టిట్యూట్ అఫ్ ఫార్మాస్యూటికల్ టెక్నాలజీ విభాగ పరిశోధనా విద్యార్థిని టి. నాగేశ్వరికి డాక్టరేట్ ప్రదానం చేశారు. అసోసియేట్ ప్రొఫెసర్ డా. కె. స్వాతి ఆధ్వర్యం లో 'స్టడీస్ ఆన్ సెలెక్టెడ్ ఫైటో కాంస్టిట్యూనట్స్ ఆఫ్ ఫీల్లంతుస్ నిరూరి ఫర్ యాంటి యూరోలిథియాటిక్ యాక్టివిటీ " అనే అంశంపై పరిశోధన గ్రంథం సమర్పించినందుకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు రిజిస్ట్రార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినర్ ప్రొఫెసర్. ఎ. శ్రీదేవీ, డైరెక్టర్ ఆఫ్ ఎగ్జామినర్ ప్రొఫెసర్ బి జీవనజ్యోతి అభినందనలు తెలిపారు.

వైసిపి అభ్యర్థుల ప్రచారం

ప్రజాశక్తి - ఓజిలి : 'మీ సేవకులుగా వుంటా.. మమ్మల్ని ఆశీర్వదించండి' అంటూ వైసిపి సూళ్లూరుపేట నియోజకవర్గ అభ్యర్థి కిలివేటి సంజీవయ్యతో కలిసి వైసిపి తిరుపతి ఎంపీ అభ్యర్థి మద్దిల గురుమూర్తి ప్రజలకు పిలుపు నిచ్చారు. మండల పరిధిలోని కురుగొండ , మనమాల , బత్తలపూరం గ్రామాల్లో తొలి ఎన్నికల ప్రచారాన్ని ముమ్మారెడ్డి రవీందర్ రెడ్డి , ఆరణి దిలీప్ కుమార్ రెడ్డి , ఉచ్చురు హరినాథ్ రెడ్డి , ఉచ్చూరు శోభారాణి , బట్ట అనిల్ కుమార్ యాదవ్ , కృష్ణ యాదవ్, కాకాని రవి ఆధ్వర్యంలో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ గడ్డం అరుణా రెడ్డి , జెడ్పిటిసి గుంటుమడుగు రవీందర్ రాజు , కో ఆప్షన్ నెంబర్ ఖాదర్ బాషా , మండల కన్వీనర్ పాదార్తి హరినాథ్ రెడ్డి , దేశి రెడ్డి మధుసూదన్ రెడ్డి , కనుమూరు గోపాల్ రెడ్డి ,పాకనాటి ప్రవీణ , దామోదర్ రాజు , ప్రభాకర్ రాజు , శ్రీధర్ రెడ్డి , వెంకట్ రెడ్డి , పి మధు రెడ్డి, బాబు రెడ్డి , ఫణి కుమార్ రెడ్డి , సురేష్ రెడ్డి పాల్గొన్నారు.

దొంగ ఓట్లపై చర్యలు తీసుకోవాలి

ఎస్పీకి టిడిపి కూటమి నాయకుల ఫిర్యాదు

ప్రజాశక్తి తిరుపతి సిటీ : తిరుపతి ఓటర్ లిస్టులోని దొంగ ఓట్లను తొలగించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ టిడిపి, బిజెపి, జనసేన కూటమి నాయకులు జిల్లా ఎస్పీకి శనివారం సాయంత్రం ఫిర్యాదు చేశారు. జిల్లా పోలీస్ కార్యాలయం చేరుకున్న నాయకులు ఎస్పీ అందుబాటులో లేకపోవడంతో ఏఎస్ పికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా కూటమి అధికార వైసిపి ఆగడాలు మితిమీరిపో తున్నాయ న్నారు.తిరుపతి కేంద్రంగా సుమారు 40వేలకు పైగా దొంగబట్లు నమోదయ్యాయని పేర్కొన్నారు. దొంగ ఓట్ల ను మరోసారి తనిఖీ చేసి తొలగించాలని, వారం రోజుల్లో దొంగ ఓట్లను తొలగించాలి, దొంగ ఓట్లను ప్రోత్సహించిన నేతలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, కిరణ్ రాయల్, రాజేష్, బిజెపి నాయకులు భాను ప్రకాష్ రెడ్డి, సామంచి శ్రీనివాస్, వరప్రసాద్, అజయ్ కుమార్, టిడిపి నాయకులు నరసింహ యాదవ్, పాల్గొన్నారు

వాలంటీర్లు రాజీనామాలు చేయొద్దు

పులివర్తి సుధారెడ్డి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): వాలంటీర్లు రాజీనామాలు చేస్తే సాధారణ వ్యక్తులుగా మిగిలిపోతారని, ఎవరూ రాజీనా మాలు చేయొద్దని వాలంటీర్లకు టిడిపి తెలుగు మహిళా నాయకురాలు పులివర్తి సుధారెడ్డి విజ్ఞప్తి చేశారు. శనివారం తనపల్లిలోని ఆమె నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వాలంటీర్లకు సముచిత స్థానాన్ని టిడిపి కల్పిస్తుం దన్నారు. వాలంటీర్లపై ఒత్తిళ్లు తీసుకొస్తూ రాజీనామా లు చేయించి ఎన్నికల్లో వారిని వాడుకోవాలని చూస్తున్నారన్నారు. ఎన్నికల సంఘం ఈ ఏడాది 85 సంవత్సరాలు నిండిన వారికి, వికలాంగులకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించిందన్నారు. చంద్రగిరి నియోజక వర్గంలో ఈ రెండు కేటగిరీలకు సంబంధించి 6 వేల మంది ఓటర్లు ఉన్నారన్నారు. వీటిని గంపగుత్తుగా ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి దక్కించుకోవాలనే కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు.

ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్నికల ఖర్చు రూ.40 లక్షలకు మించొద్దు

ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకటశివ

ప్రజాశక్తి - గంగాధరనెల్లూరు: అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసే వ్యక్తి రూ.40 లక్షలకు మించి ఖర్చు చేయరాదని ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకటశివ తెలిపారు. గంగాధరనెల్లూరు తహశీల్దార్ కార్యాలయంలో శనివారం వివిధ రాజకీయ పార్టీ నేతలతో ఎన్నికల నియమ నిబంధనలు గురించి ఆర్వో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యేగా పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్ ఫారాల్లో వివరాలు నింపేముందు ఒకటికి, రెండు, మూడు సార్లు ఆ విషయాలు పూర్తిగా చదివి తర్వాత ఫారంలోని ఖాళీలను నింపాలని కోరారు. తమిళనాడు సరిహద్దులో ఈ నియోజకవర్గ ఉన్నందున ఇక్కడ ప్రజలు వైద్యపరంగా వేలూరులోని నర్వి, సిఎంసి ఆసుపత్రి వెళ్తుంటారని అలాంటివారు అత్యవసర పరిస్థితుల్లో డబ్బులు తీసుకు వెళుంటే ఎన్నికల టీంలు అధికారులు వారిని ఇబ్బందులు పెట్టకుండా పంపించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ అధికార పార్టీ చెందినవారు కొన్నాళ్ల క్రితం ఇంటింటికి వచ్చి సీఎం జగన్‌రెడ్డి ఫోటో కలిగిన స్టిక్కర్లను అతికించారని ఇప్పటికి తొలగించకుండా అలాగే వదిలి పెట్టారని, అంతేకాకుండా పలుచోట్ల గ్రామాల్లో ప్రభుత్వ ట్యాంకులకు ఇంకా వైసీపీ రంగు కొనసాగించడం ఎంత వరకు న్యాయమని ఆర్వోకి తెలియజేశారు. ఆర్వో మాట్లాడుతూ రాజకీయ నాయకులు నోటిమాట కాకుండా ఎక్కడెక్కడ ఉందో ఫిర్యాదు అర్జీ రాసి ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రవి, వివిధ రాజకీయ పార్టీకి చెందిన నేతలు సుధాకర్, మురళి, కాళప్ప, భాస్కర్, యోనా, అధికారులు లోకనాథపిళ్లై, మహేష్, భరణి కుమార్ ,నాగరాజు , భువనేశ్వరి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకటశివ

టిడిపి నాయకుల ప్రచారం

ప్రజాశక్తి- ఎస్ఆర్ పురం: గంగాధర్ నెల్లూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ థామస్ సూచనల మేరకు మండలం ఏఎం.పురం గ్రామ పంచాయతీలో చిత్తూరు ఎంపీ అభ్యర్థి దగ్గుమల్ల ప్రసాద్‌రావు, మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గంధమనేని జయశంకర్ నాయుడు ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేఃతీ తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వస్తే వారి కుటుంబానికి ఏయే పథకాలు ద్వారా ఎంత లబ్ధి చేకూరుతుందో వివరంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో గంధంనేని రాజశేఖర్ నాయుడు, భాస్కర్ నాయుడు, మణి గుండయ్య, హేమాద్రి యాదవ్, సిద్దయ్య శెట్టి, బ్రహ్మానాయుడు, కేఎం.రవి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వెంకటేగౌడ ప్రచారం

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: వైసిపి ఎమ్మెల్యే వెంకటేగౌడ, ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కృష్ణమూర్తి శనివారం మండలంలోని బేలుపల్లి పంచాయతీలో ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. మొదట కళ్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి ప్రచారం ప్రారంభించారు. నియోజకవర్గంలో వైసిపి హయాంలో చేసిన అభివృద్ధిని వివరిస్తూ ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. రానున్న ఎన్నికల్లో తనను గెలిపించాలని వెంకటేగౌడ ప్రజలకు కోరారు. ఈ సందర్భంగా టిడిపి కార్యకర్త హరికృష్ణ ఎమ్మెల్యే సమక్షంలో వైసిపిలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం మండంలోని కుప్పనపల్లి గ్రామానికి చెందిన తిప్పన మరణించిన విషయం తెలుసుకుని తిప్పన్న మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట స్థానిక సర్పంచ్ మమత రవిచంద్రన్, నాయకులు పాల్గొన్నారు.


కృపాలక్ష్మికి గజమాల వేస్తున్న వైసీపీ నాయకులు

వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఇంటింట ప్రచారం

ప్రజాశక్తి - గంగాధరనెల్లూరు: మండలంలో వీరక్కనెల్లూరు, కొండేపల్లి పంచాయతీల్లోని పలు గ్రామాల్లో శనివారం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా కృపాలక్ష్మి మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ తరపున పోటీ చేస్తున్న ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులకు గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా అధికార ప్రతినిధి కోదండన్, కొండేపల్లి సర్పంచ్ గోవిందస్వామి పలువురు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆశయాలు సాధిద్దాం

ప్రజాశక్తి- గుడిపల్లి: మండలంలో ఆదివారం జరుగనున్న అంబేద్కర్ 134వ జయంతి వేడుకలను మండలం కేంద్రంలోని దళితవాడలో ఘనంగా నిర్వహించనున్నట్లు దళిత నాయకుడు వాసు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆదివారం ఉదయం 9 గంటలకు అంబేద్కర్ విగ్రహానికి నివాళి అర్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకుడు, కార్యకర్తలు, ప్రకజలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.


ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్సీ

ప్రజాశక్తి- గుడిపల్లి: మండలంలోని గామపంచాయతీల్లో శనివారం పట్టభద్రుల ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ఆధ్వర్యంలో టిడిపి ఎన్నికల ప్రచారం జోరుగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన, బిజెపి పార్టీల నాయకులు పాల్గొన్నారు. గడపగడపకు గ్రామపంచాయతీలోని గ్రామా ల్లో టిడిపి ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంచిపెట్టారు. టిడిపి మండల అధ్యక్షులు బాబు నాయుడు, చంద్రశేఖర్, బెటప్ప నాయుడు, హేమంబర్ గౌడ్, చంద్రప్ప, బాలచంద్ర పాల్గొన్నారు.

కుప్పంలో భరత్ ను గెలిపించండి: వైసిపి

ప్రజాశక్తి - రామకుప్పం: కుప్పం నియోజకవర్గంలో ఎమ్మెల్సీ భరత్‌ను ఎమ్మెల్యేగా గెలిపించాలని వైసిపి రామకుప్పం మండల మహిళా అధ్యక్షురాలు సుధారాణి కోరారు. శనివారం రామకుప్పం మండలంలోని బందార్లపల్లి పంచాయతీలో ఆమె ఇంటింట ప్రచారం నిర్వహించారు. ఇచ్చిన హామీలను 100శాతం పూర్తిచేసిన ఘనత సీఎం జగన్మోహన్ రెడ్డికే దక్కుతుం దన్నారు. కుప్పంలో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉన్న ఎమ్మెల్సీ భరత్‌ను ఈసారి ఎన్నికల్లో అఖండ మెజార్టీతో గెలిపించాలని మహిళలను ఆమె కోరారు.

ఓటు నమోదుకు నేడే చివరి రోజు


ఎన్నికల అధికారి ఆర్డీవో

ప్రజాశక్తి- చిత్తూరు డెస్క్: 18 సంవత్సరాలు దాటిన యువతీ యువకులకు ఓటు నమోదుకు ఆదివారం ఒక్క రోజు మాత్రమే అవకాశం ఉందని ఆపై కొత్త ఓటర్ల నమోదు చేయడం జరగదని నగరి ఎన్నికల అధికారి, ఆర్డీవో వెంకటరెడ్డి పేర్కొన్నారు. శనివారం నగరి ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన అన్ని పార్టీల నేతలు, అధికారుల సమావేశంలో ఆర్డీవో మాట్లాడుతూ ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున అన్ని పార్టీల వారు అనుమతులు లేకుండా ఏ కార్యక్రమాలు చేపట్ట రాదన్నారు. ప్రతి ఖర్చును లెక్కించడానికి అధికారలను నియమించడం జరిగిందన్నారు. నామినేషన్లు ప్రారంభించిన నాటి నుంచి ప్రక్రియ మరింత కట్టుదిట్టంగా ఉంటుందన్నారు. ఓటర్ల తొలగింపుకు, సవరణలకు గడువు ముగిసిందని ఇక అభ్యర్థనలు చేసుకున్నా స్వీకరించరని తెలిపారు. కొత్త ఓటు నమోదుకు కూడా ఆదివారం చివరి తేదీ అని ఆపై స్వీకరించరని తెలపారు. అన్నీ పోలింగ్ కేంద్రాలలో కనీస మౌలిక వసతులు కల్పించారన్నారు. ప్రశాంత వాతావరణంలో స్వార్వత్రిక ఎన్నికలు జరిగేలా రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నేతలు, అధికారులు పాల్గొన్నారు.

అపోలో విద్యార్థులకు అమెరికాలో ప్రాజెక్టులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: అమెరికాలోని బోస్టన్ బ్రిఘం హాస్పిటల్‌లో కత్రిమంగా కిడ్నీలను తయారు చేసే టెక్నాలజీలో కత్రిమ మేధస్సును ఎలా ఉపయోంగించాలో అనే అంశంపై అపోలో యూనివర్సిటీ విద్యార్థులైన జ్యోతి, ధనునజయన్ సుగన్యా, షైక్ సల్మాలకు ప్రొఫెసర్ జోసెఫ్ బొంవెంత్రి ప్రయోగశాలల్లో సంవత్సరం పాటు పనిచేసేందుకు అనుమతి లభించింది. ఆ అనుమతి పాత్రలను ప్రొఫెసర్ జోసెఫ్ బొంవెంత్రి శనివారం విద్యార్థులకు పంపించారు. ఈ కత్రిమ మేధస్సు ప్రయోగాల ద్వారా వైద్యులకు ఎంతో ప్రయాజనం అని అపోలో యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ వినోద్‌భట్ విద్యార్థులను అభినందించారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పోతరాజు, అపోలో నాలెడ్జ సిటీ అధికారి నరేష్ కుమార్‌రెడ్డి, ప్రొఫెసర్ సత్యనారాయణ విద్యార్థులను అభినందించారు.


కృత్రిమ మూత్రపిండాల తయారీకి ఎంపికైన అపోలో విద్యార్థులు


ప్రచారంలో పాల్గొన్న గాలి భానుప్రకాష్

అభివృద్ధిని చూసి ఓటెయ్యండి: భానుప్రకాష్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: రాష్ట్ర అభివృద్ధిని దృష్టిలో వుంచుకుని ఓటెయ్యాలని నగరి నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. పుత్తూరు పట్టణంలోని 15 వ వార్డులో, టిడిపి కూటమి పార్టీ నాయకులతో శనివారం ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి టిడిపి పథకాలను కరపత్రాల ద్వారా ప్రచారం చేశారు. ఈ కార్యక్రమం లో టిడిపి నాయకులు సిఎస్ఎం శరవణ అండ్ బ్రదర్స్, జలకం సునీల్ కుమార్, బిజెపి నాయకులు కనుములూరు హరి, జనసేన నాయకులు మెరుపుల మహేష్, టిడిపి కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

పిచ్చాటూరు: సత్యవేడు నియోజకవర్గ పిచ్చాటూరు మండలం రామగిరి అంకాలమ్మ ఆలయంలో సత్యవేడు నియోజకవర్గ టిడిపి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కోనేటి ఆదిమూలం శనివారం ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని రామగిరి ఎస్టీ కాలనీ వద్ద ప్రచారం చేశారు. టిడిపి నాయకులు విభేదాలు పక్కనపెట్టి గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కోరారు. ప్రతి ఇంటికి వెళ్లి స్థానికుడైన తనకు అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల నాయకులు తిరుమల రెడ్డి, ఇలంగోవన్ రెడ్డి, పద్మనాభం రాజు, సతీష్ నాయుడు, పద్దు రాజు, రవి, జయ చంద్ర నాయుడు, చిన్నా, వాసు ఢిల్లీ, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థినులకు బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి -సత్యవేడు: తిరుపతి జిల్లా సత్యవేడు బాబు జూనియర్ కళాశాలలో ఉత్తమ శ్రేణిలో ఉత్తీర్ణులైన ఇంటర్ విద్యార్థినులకు బహుమతులు ప్రదానం చేశారు. ఇంటర్ ఫలితాల్లో పరీక్షలకు హాజరైన 121 మందికి 113 మంది ఉత్తీర్ణులయ్యారు. శనివారం బాబు జూనియర్ కళాశాల ప్రాంగణంలో కరస్పాండెంట్ పరంధామ ఆధ్వర్యంలో ఉత్తమ శ్రేణిలో ఉత్తీర్ణులైన పలువురు విద్యార్థినులకు అభినందన సభ నిర్వహించారు. ముఖ్య అతిథి సత్యవేడు సీఐ దివాకర్ రెడ్డి, ఎంఈఓ రవి బహుమతులు ప్రదానం చేశారు. సీనియర్ ఇంటరు ఎంపీసీలో 976 మార్కులతో ప్రథమ శ్రేణిలో నిలిచిన విద్యార్థి భాను, జూనియర్ బైపీసీలో 435 మార్కులు పొందిన విద్యార్థి అశ్వితకు సీఐ దివాకర్ రెడ్డి బహుమతులు అందించారు. దీంతో పాటు సీనియర్ ఎంపీసీ చాందిని, బైపిసి సుమిత్ర, సీనియర్ సిబిసి గ్రూపులో అనూష, జూనియర్ ఎంపీసీ విద్యార్థి అక్షయ, తదితరులకు ఎంఈఓ రవితో కలిసి సీఐ దివాకర్ రెడ్డి జ్ఞాపికలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా స్థానిక సిఐ దివాకర్ రెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తుకు బంగారు బాట కావాలంటే విద్య ముఖ్యమన్నారు. పట్టుదల, అంకిత భావంతో చదువుకుంటే అనుకున్న లక్ష్యాలను సాధించడం సులభం అవుతుందన్నారు. ప్రతి విద్యార్థి చదువులో పోటీ తత్వం పెంచుకోవాలన్నారు. పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించడం వల్ల ఇటు కళాశాలకు, అటు తల్లిదండ్రులకు గుర్తింపుతో పాటు గౌరవ ప్రతిష్టలు పెరుగుతాయన్నారు. ఎంఈఓ రవి మాట్లాడుతూ కళాశాలలో చదువుకున్న పలువురు విద్యార్థులు ఇంటర్ పరీక్షల్లో ప్రథమ శ్రేణిలో రావడంపై అధ్యాపకుల కృషి ఎంతో ఉందన్నారు. కళాశాల యాజమాన్యం సహకరించడం వల్లే ఇది సాధ్యపడిందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పయని, బాలసుబ్రహ్మణ్యం, భాస్కర్, రత్న కుమార్, ప్రసన్న కుమార్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


బహుమతులు అందిస్తున్న సిఐ దివాకర్‌రెడ్డి

రామ్ కుమార్ రెడ్డిని గెలిపించండి..

వైసిపి నాయకుల అభ్యర్థన

ప్రజాశక్తి -వెంకటగిరి: వెంకటగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డిని గెలిపించాలని 14 వ వార్డు ధర్మాపురంలో వైసిపి నాయకులు ప్రచారం నిర్వహించారు. ధర్మాపురంలోని శ్రీ కనకదుర్గమ్మ గుడిలో పూజలు నిర్వహించి అనంతరం 14వ వార్డు కౌన్సిలర్ ఆరి శంకరయ్య, ఆ ప్రాంత వైసిపి నాయకత్వ బృందంతో పాటు కలిసి ప్రతి గడపగడపకూ తిరిగి ప్రతి ఓటరును నేదురుమల్లి రాంకుమార్ రెడ్డిని, తిరుపతి పార్లమెంటు అభ్యర్థి గురుమూర్తిని గెలిపించాలని కోరారు. నియోజకవర్గంలో కొన్ని సంవత్సరాలుగా ప్రజలకు అవసరమైన డయాలసిస్ సెంటర్ , వంద పడకల ఆసుపత్రి లాంటి ప్రతిష్టాత్మకమైన అవసరాలను కల్పించేందుకు, శాశ్వత అభివృద్ధి పనుల్లో భాగంగా ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరి శంకరయ్య, వైసిపి నాయకులు పోలయ్య బాబు, చంటి రవి, నారాయణ, శ్రీరామ్, రమణమ్మ, శ్రీనివాసులు నాయకులు, పార్టీ అభిమానులు పాల్గొన్నారు.


ప్రచారం నిర్వహిస్తున్న వైసిపి నాయకులు



లిటిల్ ఏంజెల్ స్కూల్ వార్షికోత్సవం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: లిటిల్ ఏంజెల్ హై స్కూల్ 43వ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక మహతి ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమానికి శ్రీ పద్మావతి మహిళా యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ డి.జమున ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ గత 43 సంవత్సరాలుగా విద్యారంగంలో లిటిల్ ఏంజెల్ స్కూల్ దూసుకుపోతుందన్నారు. విలువలతో కూడిన విద్యను అందిస్తూ, విద్యార్థుల్లోని సజనాత్మకతను వెలికి తీసి వారిని ప్రోత్సహిస్తూ, దేశాభివద్ధికి ఉపయోగపడే భావి భారత పౌరులుగా తీర్చిదిద్దడంలో లిటిల్ ఏంజెల్ స్కూల్ యాజమాన్యం నిరంతరం కషి చేస్తుందని, వారికి తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. విద్యా సంస్థల డైరెక్టర్ కె.ఆర్ శ్వేతారెడ్డి మాట్లాడుతూ పిల్లలు పుస్తకాలను చదవడం ఒక అలవాటుగా మార్చుకోవాలి అన్నారు. తల్లిదండ్రులు కూడా పిల్లలతో రోజుల్లో కొంత సమయాన్ని కేటాయించి వారితో గడపాలని సూచించారు. అనంతరం వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. 400 మంది పైగా విద్యార్థులతో ఏర్పాటు చేసిన సాంస్కతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కరస్పాండెంట్ రాజగోపాల్ రెడ్డి, చైర్పర్సన్ రమాదేవి, జాయింట్ సెక్రెటరీ శేఖర్ రెడ్డి, డైరెక్టర్ సి. అరవింద రెడ్డి పాల్గొన్నారు.

ప్రచార హోరు.. ఫిర్యాదుల జోరు..!

ప్రజాదృష్టి



ప్రజాశక్తి- తిరుపతి సిటి

జిల్లాలో ఎన్నికల వాతావరణం వేడెక్కుతోంది. అసలే వేసవి. ఎండలు మండుతున్నాయి. సూర్యుని వేడికంటే రాజకీయ ఎన్నికల వేడి రెట్టింపుగా ఉంది. బూర్జువా పార్టీల ఎన్నికల ప్రచారం ఆర్భాటంగా సాగుతోంది.. మరోపక్క వైసిపి నాయకులపై బిజెపి విరుచుకుపడుతోంది. ముఖ్యంగా టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి, ఈవో ఎవి ధర్మారెడ్డిలు ఓటర్లను ప్రభావితం చేసే పనిలో ఉన్నారని, వారిని తప్పించాలని ఫిర్యాదులు చేస్తుండటం గమనార్హం.

ప్రతిరోజూ అభ్యర్థి ప్రచారాన్ని పరిశీలిస్తే పెళ్లి వేడుకను తలపిస్తోంది.. అభ్యర్థితో పాటు దాదాపు వందమంది జనం తగ్గకుండా ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. డిజె సౌండ్లతో ఉన్న వాహనాలు, పవన్, చంద్రబాబు, జగన్‌ల ప్రసంగాలతో కూడిన వీడియోలతో ప్రచారంలో ముందుంటున్నాయి. రాజకీయ పార్టీల పాటల హోరు ఆ ప్రాంతంలో హోరెత్తిస్తున్నాయి. ఆ తరువాత డప్పుల దళాల మోత, అభ్యర్థి, ద్వితీయశ్రేణి నాయకత్వం, జనం, పూలహారాలు, పూలతో స్వాగతం పలకడం తదితర ముందస్తు ఏర్పాట్లతో ప్రచారం హోరెత్తుతోంది. పార్టీల ప్రచార కరపత్రాలను డివిజన్లలో విరజిమ్ముతున్నారు. ఇంత ఆర్భాటం చేస్తున్నా పార్టీలకు అసమ్మతి ఉన్న చోట మాత్రం ప్రథమ శ్రేణి నాయకత్వం అండగా లేకపోవడం లోపంగానే కనిపిస్తోంది. అభ్యర్థి గుండెల్లో గుబులుగానే ఉంటోంది. అధినేతల జోక్యం ఎంత ఉంటున్నా కలుపుకుపోలేని పరిస్థితి. ముఖ్యంగా తిరుపతిలో జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులుకు టిడిపి, జనసేన ప్రధాన నాయకత్వం దూరంగా ఉండటం అనే సమస్య సమసిపోలేదు. తాజాగా జనసేన అధినేత పవన్‌కల్యాణ్ స్వయంగా విచ్చేసి మరి ఎటువంటి పరిస్థితుల్లోనూ కూటమి ఓట్లు చీలకూడదని వార్నింగ్ ఇచ్చి మరీ వెళ్లారు. అయితే తెల్లారే షరా మామూలే. అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు వెంట ప్రధాన నాయకత్వం ఎక్కడా కనిపించలేదు. ఇదే పరిస్థితి సత్యవేడు టిడిపిలోనూ, గూడూరులోనూ నెలకొంది. ఏదిఏమైనా టిడిపిలో అసమ్మతిని అధినేతలు ఎంత సర్దుబాటు చేస్తున్నా దారికొచ్చే పరిస్థితి అయితే కనిపించడం లేదు.

అధికారులకు బెదిరింపులు

ఒక పక్క అసంతృప్తి నాయకులను బుజ్జగిస్తూనే..మరో పక్క అధికార పార్టీకి అధికారులు వత్తాసు పలుకుతున్నారనే అనుమానంతో బెదిరింపులకు దిగుతున్నారు. అందుకు టిటిడినీ వదలడం లేదు. ఏళ్ల తరబడి టిటిడి ఈవోగా ఉంటున్న ధర్మారెడ్డి అధికార పార్టీకి అండగా ఉన్నాడని, టిటిడి నిధుల మళ్లింపు, సిబ్బంది ఓట్లను గంపగుత్తేగా అధికార పార్టీకి మళ్లించేలా వ్యవహరిస్తున్నారని, అతన్ని వెంటనే బదిలీ చేయాలంటూ ఎన్నికల విధులకు ఏమాత్రం సంబంధం లేని టిటిడిని కూడా మతతత్వ పార్టీ బిజెపి రాజకీయాల్లోకి లాగడం గమనార్హం. తాము హిందువులమని, హిందూ సిద్ధాంతాలను కాపాడతామని చెప్పకునే బిజెపి, ఏకంగా ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన టిటిడిపైనే ఈసికి ఫిర్యాదు చేయడం కొసమెరుపు. మరో పక్క ఎన్నికల సమయంలో టిటిడి ఛైర్మన్‌గా తిరుపతి ఎంఎల్‌ఎ భూమన కరుణాకర్‌రెడ్డిని తప్పించాలని డిమాండు పైకి తెచ్చారు. ఇంకో పక్క దొంగ ఓట్ల నమోదు కేసును వేగవంతం చేసి, అధికారులపై తక్షణం చర్యలు తీసుకోవాలని ఈసిపై ఒత్తిడి తెస్తున్నారు. రెండు రోజుల క్రితం తిరుపతి పర్యటనకు వచ్చిన రాష్ట్ర ఎన్నికల అధికారికి బిజెపి నాయకులు ఫిర్యాదు చేశారు. అది కేంద్ర ఎన్నికల సంఘం చూసుకుంటుందని చెప్పినా, అధికారులు వెంటనే స్పందించాలని డిమాండు చేసే స్థాయికి వెళ్లారు. ఇంకో పక్క ప్రార్థన స్థలాలను సైతం గొడవలకు కేంద్రాలుగా చేసేందుకు పూనుకున్నారు. రంజాన్ వేళ తిరుపతిలో ఓ దశలో భౌతిక దాడులకు సిద్ధపడ్డారు. పెద్దల జోక్యంతో సద్దుమణిగింది. వీటన్నిటిని గమనిస్తున్న ఓటర్లు ఏ పక్షాన నిలబడతారో వేచి చూడాల్సిందే.

బిసివైపి పైనే లక్ష్యం

- **దాడుల వెనుక 'పెద్దాయన' మర్మమేంటి..?**

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో



పుంగనూరు నియోజకవర్గంలో భారత చైతన్య యువజన పార్టీపై నిరంతరం దాడులు కొనసాగుతూనే ఉన్నాయి.. పార్టీ ప్రారంభించకముందు నుంచే పార్టీ వ్యవస్థాపకులు బోడే రామచంద్రయాదవ్ ఇంటిని, వాహనాలను ధ్వంసం చేశారు. ఈ నేపథ్యంలోనే కేంద్రం వై ప్లస్ భద్రతను సైతం ఇచ్చింది. అయినా దాడులు ఆగనేలేదు. ఏ సభ పెట్టాలన్నా, సదస్సులు పెట్టాలన్నా అధికార పార్టీ నిర్బంధం విధించడం, అడ్డుకోవడం షరా మామూలయ్యింది. పోలీసులు ఏకపక్ష ధోరణితో వ్యవహరిస్తున్న నేపథ్యంలో ప్రజాస్వామ్యవాదులు అండగా నిలవాలని అభ్యర్థి రామచంద్రయాదవ్ కోరుతున్నారు. తాజాగా ఎన్నికల ప్రచార వాహనంలో డిజె సౌండ్స్ పెట్టారని వైసిపి కార్యకర్తలు దాడులకు పాల్పడటం గమనార్హం.

భారత చైతన్యయోజన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు బోడే రామచంద్రయాదవ్ పార్టీ స్థాపించక ముందు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సొంత మండలమైన సదుంలో రైతుభేరి ధర్మయుద్ధ సభను నిర్వహిస్తామని, ప్రధానంగా రైతు సమస్యలపై చర్చించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని రైతులకు పిలుపునిచ్చారు. ముందస్తు సమాచారం మేరకు సభకు పోలీసులు అనుమతి నిరాకరించారు. సభ నిర్వహించి తీరుతానని రామచంద్రయాదవ్ శపథం చేయడంతో పోలీసులు ముందస్తుగా రామచంద్రయాదవ్ ఇంటిని దిగ్బంధించారు. ఆ ప్రాంతంలోకి ఎవరినీ రానివ్వకుండా భయభ్రాంతులను కల్పించారు. సాయంత్రం వరకూ పోలీసులు ఇంటి వద్దనే పోలీసు పహరా కాశారు. అదేరోజు సాయంత్రం రామచంద్ర యాదవ్ అనుచరులతో పట్టణంలో ర్యాలీ నిర్వహించి మంత్రికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అంబేద్కర్ సర్కిల్లో ధర్నా చేపట్టారు. దీంతో వైసిపి నాయకులు రెచ్చిపోయి అదేరోజు రాత్రి పుంగనూరు మండలంలోని మున్సిపల్ కేంద్రం నుంచి దాదాపు 300 మంది కార్యకర్తలు, ప్రధాన నాయకత్వం రామచంద్రయాదవ్ ఇంటిపై దాడి చేశారు. ఇంటిపై విధ్వంసం సృష్టించారు. ఈ సంఘటన అప్పట్లో రాష్ట్రవ్యాప్తంగా పెను సంచలనం కలిగించింది. దాడి జరిగిన సంఘటనను కేంద్ర హోంమంత్రి అమిత్‌షా దృష్టికి రామచంద్రయాదవ్ తీసుకెళ్లారు. దీంతో ఆయనకు కేంద్ర ప్రభుత్వం 'వై' ప్లస్ సెక్యూరిటీ భద్రత కల్పించింది. తరువాత బిసివై పార్టీని ప్రకరటించారు. అప్పటినుంచి పుంగనూరు నియోజకవర్గంలో రైతాంగ సమస్యలపై ధర్మపోరాట సభను నిర్వహించాలని ముందస్తుగా ప్రకటించినా సభను జరగనీకుండా పోలీసులు అడ్డుకుని కేసులు పెట్టారు. నిరుద్యోగుల కోసం ఉద్యోగమేళ తన సొంత స్థలంలో నిర్వహిస్తే జరగనీకుండా అడ్డుకున్నారు. ఉద్యోగమేళాకు వస్తున్న నిరుద్యోగులను ఎక్కడికక్కడ నిలిపివేసి తిరిగి వెనక్కి పంపించారు. మూడు పర్యాయాలు ధర్మపోరాట సభ నిర్వహించాలని ప్రకటిస్తే పోలీసులు 30 యాక్ట్ అమల్లో ఉందని సభ నిర్వహించకుండా నోటీసులు ఇచ్చారు. పుంగనూరులోని ఓ ప్రైవేట్ రైతు స్థలంలో రైతుభేరి సభ ఏర్పాటు చేస్తుండగా పోలీసులు రంగప్రవేశం చేసి అడ్డుకోవడంతో పాటు, బిసివైపి కార్యకర్తలను చెప్పులతో కొట్టి నాయకులను, కార్యకర్తలను తరిమేశారు. సొంత మామిడి తోటలో పట్టణానికి ఎనిమిది కిలోమీటర్ల దూరంలో నిర్వహించుకున్నారు. ఇటీవల ఎన్నికల కోడ్ అమల్లో ఉందని సదుం మండల కేంద్రంలో బిసివై పార్టీ బొలెరో వాహనాల్లో డిజె మైక్‌సెట్ కట్టుకుని ప్రచారానికి వెళితే అక్కడా వైసిపి కార్యకర్తలు తెగబడి వాహనాలను ధ్వంసం చేసి వారిపై దాడులకు తెగబడ్డారు. ఒక పార్టీనే లక్ష్యం చేసుకుని పలు సందర్భాల్లో దాడులు చేస్తుంటే రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఉన్నట్టా, లేనట్టా అని బిసివై కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు. ఇన్నిసార్లు దాడులు చేసినా వారిపై మాత్రం కేసులు నమోదైన దాఖలా లేదు. ఎదురు కేసులు బిసివైపైనే నమోదు కావడం పోలీసుల పక్షపాత వైఖరికి నిదర్శనమన్న ఆరోపణలున్నాయి. ఏదిఏమైనా నియోజకవర్గంలో త్రిముఖ పోటీ నెలకొన్న నేపథ్యంలో బిసివై పార్టీ పోటీ వల్ల ఓట్ల చీలికలు, పొందికలు ఎలా ఉంటాయో వేచి చూడాల్సిందే.



2020 డిసెంబర్‌లో రామచంద్ర యాదవ్ ఇంటిపై జరిగిన దాడులు (ఫైల్‌ఫొటో)



